teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 410 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 23 జూన్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## విడుదలైన సీపీగెట్ 2024 పరీక్షల షెడ్యూల్

### జూలై 6 నుంచి పరీక్షలు ప్రారంభం.. జూలై 17తో పూర్తికానున్న పరీక్షలు




హైదరాబాద్, జూన్ 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సీపీగెట్ 2024 పరీక్షల షెడ్యూల్ వచ్చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి తేదీలను ప్రకటించింది. జూలై 6వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జూలై 17వ తేదీతో ఈ పరీక్షలన్నీ పూర్తి కానున్నాయి. రాష్ట్రంలోని పీజీ కాలేజీల్లో ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంపీఈడీ కోర్సు ప్రవేశాలకు ఉస్మానియా యూనివర్సిటీ సీపీగెట్ నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని

మిగతా 2 లో




## నీట్ లీకేజీపై కేంద్రం దిద్దుబాటు చర్యలు

నిర్వహణపై నిపుణుల కమిటీని ఏర్పాటు

రాధాకృష్ణన్ నేతృత్వంలో 7కమిటీ సభ్యుల నియామకం

.. వివరాలు 2లో



# తెలంగాణ రాష్ట్ర బీజేపీలో అధ్యక్ష పదవి లొల్లి

## అధ్యక్ష రేసులో ఐదుగురు నేతలు

### రాష్ట్ర అధ్యక్ష పదవికోసం పలువురు లీడర్ల ప్రయత్నాలు

### అగ్రనేతల ఆశీస్సులు కోసం ఢిల్లీ బాటలో ఆశావాహులు

తెలంగాణ రాష్ట్ర బీజేపీలో గ్రూపుల లొల్లి కొనసాగుతోంది. రాష్ట్ర అధ్యక్ష పదవికోసం పలువురు లీడర్లు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఢిల్లీ వెళ్లి అగ్రనేతలను కలిసి ఆశీస్సులు పొందుతున్నారు. మరికొందరు ఆర్ఎస్ఎస్ ద్వారా ప్రయత్నాలను ప్రారంభించారు.



తెలంగాణ బ్యూరో, జూన్ 22 (తీన్మార్ న్యూస్): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన కామెంట్లు సంచలనం రేకెత్తించాయి. ఆయన నిన్న విడుదల చేసిన వీడియో హాట్ టాపిక్ గా మారింది. పరోక్షంగా ఎవరికి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వొద్దో ఈ వీడియోలో చెప్పేశారు. కొంత కాలంగా బీజేపీ స్టేట్ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో రాజాసింగ్ కు గ్యాప్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. గతంలో బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రెగ్యులర్ గా నాంపల్లి ఆఫీసుకు వచ్చి ప్రెస్ మీట్లు పెట్టిన రాజాసింగ్ ఇప్పుడు ఆఫీసు రావడం లేదు. గోషామహల్ ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ కు పార్టీ ఫ్లోర్ లీడర్ పదవిని ఇస్తారనే చర్చకూడా సాగింది. అయితే

మిగతా 2 లో



## రుణమాఫీకి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవద్దు

ఉద్యోగం ఉందని పథకాలు దూరం అవుతున్న తల్లిదండ్రులు

తల్లిదండ్రులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

సీఎం రేవంత్‌ను కోరిన నల్గొండ జిల్లాకు చెందిన ఏఈఓ

తెలంగాణ బ్యూరో, జూన్ 22 (తీన్మార్ న్యూస్): రుణమాఫీకి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవద్దని నల్గొండ జిల్లా పాలెం గ్రామానికి చెందిన ఏఈఓ పరశురాములు సీఎం రేవంత్‌ను కోరారు. కుటుంబంలో తానొక్కడినే కిందిస్థాయి ఉద్యోగినని, ఇద్దరు తమ్ముళ్లు కూలీ పనులు చేస్తారన్నారు, తనకు ఉద్యోగం ఉందని తల్లిదండ్రులకు రేషన్ కార్డు తొలగించి, ఫించన్లు ఇవ్వడం లేదని తెలిపారు. తన తల్లిదండ్రులకు రేషన్ కార్డు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రైతురుణాలు

మిగతా 2 లో




## ఫర్టిలైజర్స్‌పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించాలి

రాష్ట్రాలకు జీఎస్టీలో వెసులుబాటు ఇవ్వాలి

కేంద్ర ప్రాయోజిత పథకాలపై పునఃసమీక్షించాలి

జీఎస్టీ సమావేశంలో కేంద్రాన్ని కోరిన ఆర్థిక శాఖ మంత్రి భట్టి

.. వివరాలు 2లో

## సింగరేణిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధ్వంసం చేసింది

### లాభాల్లో ఉన్న సింగరేణిని అప్పుల పాలు చేసింది

### గత ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్, జూన్ 22 (తీన్మార్ న్యూస్): సింగరేణిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా ధ్వంసం చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. సింగరేణిని కేసీఆర్ సర్కార్ పూర్తిగా నిర్వీర్యం చేసిందని లాభాల్లో ఉన్న సింగరేణిని పూర్తిగా అప్పుల పాలు చేసిందని చెప్పారు. 2024, జూన్ 22వ తేదీ హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ఏప్రిల్ 1, 2014 నాటికి సింగరేణి బ్యాంక్ అకౌంట్లలో రూ.3వేల 500 కోట్లు

మిగతా 2 లో



## ముగిసిన డీఎస్సీ దరఖాస్తుల గడువు

11,062 పోస్టులకు 2,79,956 అప్లికేషన్లు

హైదరాబాద్‌లో ఎక్కువ.. మేడ్చల్‌లో తక్కువ

జులై 17 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు

.. వివరాలు 2లో



## సమస్యల్ని పరిష్కరించాలంటూ జూనియర్ డాక్టర్ల డిమాండ్

కళ్లకు బ్లాక్ క్లాత్ కట్టుకొని జూనియర్ డాక్టర్ల నిరసన

జూన్ 24 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జూడాల సమ్మె బాట

హైదరాబాద్, జూన్ 22 (తీన్మార్ న్యూస్): తమ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కళ్లకు బ్లాక్ క్లాత్ కట్టుకొని ఉస్మానియా మెడికల్ కాలేజీ లో జూనియర్ డాక్టర్లు నిరసనకు దిగారు. ప్రభుత్వం తమ సమస్యలకు పరిష్కారం చూపించకపోతే జూన్ 24వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు సమ్మె బాట పట్టనున్నారు. టైమ్ కు జీతాలు ఇవ్వాలని వాళ్లు డిమాండ్ చేస్తున్నారు. జూడాల సమ్మెకు సంఘీభావంగా కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్లు (జూడాలు) కళ్లకు బ్లాక్ క్లాత్ కట్టుకుని నిరసన తెలిపారు. వరంగల్ లోనూ డాక్టర్లు నిరసన తెలుపుతూ ప్రతినెల

మిగతా 2 లో

## రాష్ట్ర అభివృద్ధికి కాళేశ్వరం ప్రాజెక్టు ఓ చావు దెబ్బ

### సివిల్ కోర్టుకున్న అధికారాలు జుడీషియల్ కమిషన్‌కు ఉంటాయి




ఇరిగేషన్ మాఫియాగా మారిందంటూ పలువురి ఆరోపణలు

మొత్తం ప్రాజెక్టుపై సమగ్ర న్యాయవిచారణ జరిపించాలి

కమిషన్‌లను బెదిరించే కేసీఆర్ రాచరిక విధానాలను ఖండించండి

తెలంగాణ జలసాధన సమితి, రైతుసంక్షేమ సమితి నాయకులు

.. వివరాలు 2లో



## సింగరేణిలో అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా

కాంగ్రెస్ కు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ సవాల్

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

.. వివరాలు 2లో

## ఆషాడ బోనాల నిర్వహణలో శివసత్తులకు ప్రాధాన్యత:ప్రభుత్వం

కమిటీలో శివసత్తుల సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించాలి

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని కోరిన జోగిని శ్యామల

హైదరాబాద్, జూన్ 22 (తీన్మార్ న్యూస్): ఆషాడ బోనాల నిర్వహణలో ఆలయాల్లోని శివసత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్సవ కమిటీలో తెలంగాణ శివసత్తుల సంక్షేమ సంఘం సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ శివసత్తుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ జోగిని కొలిపాక శ్యామల దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని కోరారు. ఈ మేరకు జోగిని శ్యామల ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు మంత్రి కొండా సురేఖని సెక్రటేరియట్ లోని వారి కార్యాలయంలో కలిసి

మిగతా 2 లో





## కెయూలో ఒక గంట పాటు క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాం

కాలుష్యాన్ని తగ్గిస్తూ పర్యావనాన్ని పెంచడమే ఉద్దేశ్యం

హిస్టరీ అండ్ టూరిజం హెచ్ఓడి డాక్టర్. సీహెచ్. రాజకుమార్

.. వివరాలు 2లో

## నీట్ లీకేజీపై కేంద్రం దిద్దుబాటు చర్యలు

న్యూ ఢిల్లీ, జూన్ 22 (తీన్మార్ న్యూస్): నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. పరీక్షల నిర్వహణపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఇస్రో మాజీ చైర్మన్ కే రాధాకృష్ణన్ నేతృత్వంలో ఏడుగురు కమిటీ సభ్యుల్ని నియమించింది. లీకేజీపై రెండు నెలల్లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, కేంద్రం ఆదేశాలతో రాధాకృష్ణన్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల కమిటీ ప్రవేశ పరీక్ష విధానంలో సంస్కరణలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పని విధానాల్లో మార్పులు, డేటా సెక్యూరిటీ తదితర అంశాలపై కమిటీ సిఫారసులు చేయనుంది. రాధాకృష్ణన్‌తో పాటు కమిటీలో ఎయిమ్స్ ఢిల్లీ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదారబాద్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రామమూర్తి, ఐఐటీ మద్రాస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఎమిరిటస్, కర్మయోగి భారత్ సహ వ్యవస్థాపకుడు పంకజ్ బన్సల్, ఐఐటీ ఢిల్లీ డీన్ (విద్యార్థి వ్యవహారాలు) ప్రొఫెసర్ ఆదిత్య మిట్టల్, కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్ సభ్యులుగా ఉన్నారు.

## ఫర్టిలైజర్స్ పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించాలి

హైదరాబాద్, జూన్ 22 (తీన్మార్ న్యూస్): విభజన చట్టంలోని 2200 కోట్లు ఇంకా విడుదల కాలేదన్నారు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క. జీఎస్టీ సమావేశంలో పాల్గొన్న భట్టి రాష్ట్రాలకు వెసులుబాటు ఇవ్వాలని కోరామన్నారు. మూలధనం వ్యయాన్ని పెంచి పథకాలు కొనసాగించాలన్నారు. ఆదాయ పంపిణీలో అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. కేంద్ర పన్నులతో రాష్ట్రాల ఆదాయం తగ్గిందని చెప్పారు. కొన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలపై పున:సమీక్షించాలని కోరారు. సర్ చార్జీలు, సెస్ లపై 10 శాతం మించి ఉండొద్దన్నారు. స్కిల్ డెవల్ పమెంట్ సెటర్లను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరామన్నారు మంత్రి భట్టి విక్రమార్క. వెనుబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు పెంచాలన్నారు. తెలంగాణకు మరిన్ని నవోదయ పాఠశాలలు పెంచాలన్నారు. మూసీ డెవ్లప్మెంట్ ప్రాజెక్టుకు కేంద్ర సహకారం కోరామన్నారు. ఫర్టిలైజర్స్ పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర సమస్యలపై మరోసారి నిర్మలాసీతారామన్ ను కలుస్తామని వెల్లడించారు భట్టి.

## సింగరేణిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధ్వంసం చేసింది

మొదటి పేజీ తరువాయి

ఉండేవని కిషన్ రెడ్డి చెప్పారు. 2014కు ముందు సింగరేణి సంస్థ బ్యాంకులను డామినేట్ చేసేదని అధిక వడ్డీలు ఎవరిస్తారని బ్యాంకులకు ఆఫర్ ఇచ్చేదని తెలిపారు. 2014కు ముందు ఏ ఒక్కసారి కూడా ఉద్యోగులకు జీతాలు కట్ చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు రూ. 30వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు కిషన్ రెడ్డి. సింగరేణి చెల్లించాల్సిన బిల్లులు సకాలంలో చెల్లించలేని పరిస్థితి ఉందని కేసీఆర్ పాలనలో విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. సింగరేణికి విద్యుత్ సరఫరా చేసే సంస్థలకు కూడా నిధులు సకాలంలో ఇవ్వలేదన్నారు. సబ్సిడీ బిల్లులు చెల్లించకపోవడం కారణంగా విద్యుత్ సంస్థలు నష్టాల్లో ఉన్నాయని చెప్పారు. 6 శాతం వడ్డీతో చెల్లించాల్సిన బకాయిలను కూడా సింగరేణి చెల్లించలేదన్నారు. కేసీఆర్ సింగరేణి చేస్తున్న బొగ్గు సరఫరా బకాయిలు జన్కోకు సకాలంలో చెల్లించలేదని కేసీఆర్ తప్పుడు పాలన వల్లే సింగరేణికి అప్పు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో జరిగిన అధికార దుర్వినియోగం ఎప్పుడూ జరగలేదన్నారు. కేసీఆర్ ఏనాడు కార్మికులను కలిసిన పాపాన పోలేదని విమర్శించారు. 2014కు ముందు సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా ఉండేది కాదని బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక సర్పంచ్ నుంచి మంత్రుల వరకు సింగరేణిని దోచుకున్నారని ఆరోపించారు. ఎంఎల్ఏలకు సింగరేణి ప్రోటోకాల్ ఉండాలని కేసీఆర్ సింగరేణిక చెప్పారని ఎంఎల్ఏలకు, సింగరేణికి ఏంటీ సంబంధం అని ప్రశ్నించారు. కేసీఆర్ ఆదేశాలతో ఇష్టారాజ్యంగా ఎంఎల్ఏలు, మంత్రులు సింగరేణిని ఉపయోగించుకున్నారని అన్నారు. ఒక కార్మికుడి షిఫ్ట్ చేంజ్ చేసుకోవాలన్నా స్థానిక ఎంఎల్ఏ పర్మిషన్ కావాల్సిన పరిస్థితి తీసుకొచ్చారని ఫైరయ్యారు. కేసీఆర్ కుటుంబం సింగరేణిపై మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. సింగరేణిని కేసీఆర్ ఏనాడు పట్టించుకోలేదని కేవలం రాజకీయంగా మాత్రమే ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తారు. కేంద్రాన్ని ఏ విషయంలోనూ కేసీఆర్ సంప్రదించలేదని సింగరేణి విషయంలో49శాతం వాటా ఉన్న కేంద్రాన్ని కేసీఆర్ ఎప్పుడూ సంప్రదించలేదని కిషన్ రెడ్డి విమర్శించారు.

## సమస్యల్ని పరిష్కరించాలంటూ జూనియర్ డాక్టర్ల డిమాండ్

మొదటి పేజీ తరువాయి

క్రమం తప్పకుండా జీతాలు అందివ్వాలని డిమాండ్ చేశారు.

జూనియర్ డాక్టర్ల సమస్యలు, డిమాండ్స్

లి ఉస్మానియా హాస్పిటల్కు నూతన భవనం నిర్మించాలని ఆరేళ్ల నుంచి కోరుతున్న అధికారులు, ప్రభుత్వాలు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు.

- టైమ్ కు జీతాలు ఇవ్వాలని కొన్ని నెలల నుంచి డిమాండ్ చేస్తున్నారు.
- గత ఆరు నెలలుగా స్టైఫండ్ రావడం లేదని, వచ్చేలా చేయాలని జూడాలు డిమాండ్.
- డాక్టర్లకు కూడా ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు.
- ఉస్మానియా ఆసుపత్రిలో స్థలం లేక పేషెంట్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- రాష్ట్రంలో డాక్టర్లకు భద్రత లేకుండా పోయింది. తరుచూ ఏదో చోట వైద్యులపై దాడులు జరుగుతున్నాయి.
- వైద్య విద్యార్థులకు సీట్లు పెంచుతున్నారు కానీ అందుకు తగ్గట్లుగా హాస్టల్స్ పెంచి సౌకర్యాలు కల్పించడం లేదు. అయితే ప్రభుత్వం తక్షణమే స్పందించి డాక్టర్లు, జూనియర్ డాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## సింగరేణిలో అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా

కరీంనగర్, జూన్ 22 (తీన్మార్ న్యూస్): సింగరేణిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా.. అంటూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కరీంనగర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. సీబీఐ విచారణ జరిపితే గత ప్రభుత్వ నిర్వాకంతోపాటు సింగరేణి దుస్థితికి కారకులెవరో తేలిపోతుందన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, ప్రధాని మోదీ ప్రకటించిన తర్వాత కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ మళ్లీ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించడం అసాధ్యమని స్పష్టం చేశారు. మోదీ రామగుండం వచ్చినప్పుడు సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారని, సింగరేణిలో కేంద్రానిది 49% వాటా, రాష్ట్రానిది 51 శాతం ఉందన్నారు. అట్లాంటప్పుడు సింగరేణి ప్రైవేటీకరించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. సింగరేణి ఈ దుస్థితికి రావడానికి ప్రధాన కారణం నాటి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. తాడిచర్లలో ఏపీ జెన్‌కోకు ఇస్తే కేసీఆర్ ప్రభుత్వం ప్రైవే ట్ వారికి అప్పగించింది నిజం కాదా.. సింగరేణి ని ప్రైవేటీకరించిందే కేసీఆర్ అని ఆరోపించారు.

## ఆషాడ బోనాల నిర్వహణలో శివసత్తులకు ప్రాధాన్యత:ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

వినతిపత్రం సమర్పించారు. ఈ ఆషాడ బోనాల్లో ప్రజలు, శివసత్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైభవోపేతంగా బోనాల పండుగను నిర్వహించాలని, శివసత్తులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయాలని, సుదీర్ఘ కాలంగా బోనాల పండుగ వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్న తెలంగాణ శివసత్తుల సంక్షేమ సంఘానికి ప్రభుత్వ గుర్తింపునివ్వాలని వారు మంత్రి సురేఖను కోరారు. వారి విన్నపాలను ఓపికతో విన్న మంత్రి సురేఖ సానుకూలంగా స్పందించారు. శివసత్తులను ప్రజలు దైవాంశంగా భావిస్తారని అన్నారు కొండా సురేఖ. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల పండుగలో శివసత్తులకు ప్రత్యేక స్థానమున్నదని తెలిపారు.

## జూన్ 24న విడుదలకానున్న గ్రూప్-1 ప్రిలిమినరీ ఓఎంఆర్ షీట్

తెలంగాణ బ్యూరో, జూన్ 22 (తీన్మార్ న్యూస్): గ్రూప్–1 ప్రిలిమినరీ ఎగ్జామ్ రాసిన అభ్యర్థులకు సంబంధించి టీజీపీఎస్సీ కీలక ప్రకటన జారీ చేసింది. ప్రిలిమినరీ ఎగ్జామ్ ఓఎంఆర్ షీట్లను జూన్ 24న సాయంత్రం 5 గంటల నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచబోతున్నట్లు ప్రకటించింది. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో తమ వివరాలను ఎంటర్ చేసి తమ ఓఎంఆర్ షీట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. ఇక ఇటీవల జరిగిన గ్రూప్ –1 ఉద్యోగాలకోసం 4,03,667 అప్లికేషన్లు రాగా 3,02,172 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపింది. ఇదిలా ఉంటే తెలంగాణ గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధిత ప్రిలిమినరీ కీతో పాటు మాస్టర్ ప్రశ్నపత్రాన్ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జూన్ 13న విడుదల చేసింది. ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఉంటే జూన్ 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో తెలియజేయాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 563 గ్రూప్–1 పోస్టులకు గాను 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 897 పరీక్ష కేంద్రాల్ని ఏర్పాటు చేయగా 3.02 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు.

# తెలంగాణ రాష్ట్ర బీజేపీలో “అధ్యక్ష పదవి” లొల్లి

మొదటి పేజీ తరువాయి

రకరకాల కారణాలతో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన ఏలేటి మహేశ్వర్ రెడ్డికి ఫ్లోర్ లీడర్ పోస్టు అప్పగించారు. దీంతో ఆయన అలకబూనారని తెలుస్తోంది. తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. హైదరాబాద్ ఎంపీగా అభ్యర్థిగా కొంపెల్ల మాధవీలతను ప్రకటించిన నేపథ్యంలో రాజాసింగ్ చేసిన కామెంట్లు కలకలం రేపాయి. ఇటీవల హైదరాబాద్ లో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ల సన్మానం కోసం నిర్వహించిన ‘సెల్యూట్ తెలంగాణ’ సభకు కూడా రాజాసింగ్ హాజరు కాలేదు. మరుసటి రోజు (నిన్న) ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎంపిక ఎలా ఉండాలో చెప్పారు. ఈ వీడియో సందేశం చూసిన వారికి ఎవరిని నియమించవద్దో డైరెక్టుగానే చెప్పినట్టు అర్థమవుతోంది. ఈ వ్యాఖ్యల వెనుక ఉన్నదెవరు ఎవరు పరోక్షంగా రాజాసింగ్ తో చెప్పించారనేది చర్చనీయాంశంగా మారింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షపదవి రేసులో ఐదుగురు నేతలున్నారు. ఎవరిక వారుగా తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నిజామాబాద్ ఎంపీ అరవింద్, మాజీ ఎమ్మెల్సీ



రాంచందర్ రావు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. రాజాసింగ్ కామెంట్ చేసినట్టు చూసుకుంటే వీరిలో ఈటల రాజేందర్ వామపక్ష భావాలున్న నాయకుడు. బీఆర్ఎస్ లో కొనసాగి బీజేపీలోకి మారారు. డీకే అరుణ గతంలో కాంగ్రెస్ లో మంత్రిగానే విధులు నిర్వర్తించారు. రఘునందన్ రావు కూడా గతంలో బీఆర్ఎస్ లో చాలా కాలంపాటు పనిచేశారు. కేసీఆర్ కు సన్నిహితుడిగా కూడా కొనసాగారు. ఇక మిగిలింది. రాంచందర్ రావు, నిజామాబాద్ ఎంపీ అరవింద్. వీళ్లిద్దరిలో రాంచందర్ రావు పూర్తి ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన లీడర్. మొదటి నుంచి బీజేపీలోనే కొనసాగుతున్నారు. మరో నాయకుడు ధర్మపురి అర్వింద్ ఆయన రాజకీయ జీవితం బీజేపీలోనే ప్రారంభమైంది. రాజాసింగ్ చెప్పిన రెండో స్వభావం దూకుడు అరవింద్ కు ఉంది. రాజాసింగ్ పరోక్షంగా అర్వింద్ కు మద్దతు ఇచ్చారా.. లేదా రాంచందర్ రావును సపోర్ట్ చేస్తున్నారా.. అన్న చర్చనడుస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా దేశం, ధర్మం పట్ల అవగాహన ఉన్నవారిని నియమించాలని రాజాసింగ్ కోరారు. పార్టీలో అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత అధ్యక్షుడి ఎంపిక జరగాలని, 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేల ఒపీనియన్స్ తీసుకోవాలంటూ ఓ వీడియో విడుదల చేశారు. రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమంటూనే దూకుడుగా వ్యవహరించే వ్యక్తికే పగ్గాలు అప్పగించాలనే మరో సూచన చేశారు.

## రాష్ట్ర అభివృద్ధికి కాళేశ్వరం ప్రాజెక్టు ఓ చావు దెబ్బ

హైదరాబాద్, జూన్ 22 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధిని చావు దెబ్బతీసింది. సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలు జుడీషియల్ కమిషన్‌కు ఉన్నాయి. మొత్తం ప్రాజెక్టుపై సమగ్ర న్యాయవిచారణ జరిపించాలి. తప్పుల తడక డిజైన్లకు ఎలా అనుమతిచ్చారు. ఇరిగేషన్ అంటేనే మాఫియాగా మారింది అని పలువురు వక్తలు ఆరోపించారు. జుడీషియల్ కమిషన్‌లను బెదిరించే కేసీఆర్ భూస్వామ్య రాచరిక విధానాలను ఖండించండి, మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపించండి అంటూ తెలంగాణ జలసాధన సమితి, తెలంగాణ రైతుసంక్షేమ సమితిల ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమితి అధ్యక్షుడు నైనాల గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం వేసిన జుడీషియల్ కమిషన్ విచారణ ప్రభుత్వం రిఫరెన్స్ చేసిన విషయాల వరకు మాత్రమే పరిమితం అవుతుందని అన్నారు. జుడీషియల్ కమిషన్ అంటే సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలు ఉంటాయని అన్నారు. న్యాయ నిపుణుల సలహా తీసుకుని ఒక క్రిమినల్ ఫిర్యాదును తయారు చేసి సీఎంకు, డీజీపీకి, ఏసీబీకి పంపిద్దామని అన్నారు. కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో ఎన్డీఏ, టీఆర్ఎస, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అనేక విషయాల్లో ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నాయని ఆరోపించారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ ప్రపంచంలో అద్భుతమైన ప్రాజెక్టు అని చెప్పుకుంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధిని చావు దెబ్బతీసిందని ఆరోపించారు. అసలు ప్రాజెక్టుకు ఎవరు అనుమతి ఇచ్చారు అని నీటిపారుదల విశ్లేషకులు సాంబశివరావు ప్రశ్నించారు. తప్పుల తడక డిజైన్లు, తడక లాంటి నిర్మాణాలు, వర్షం పడితే కొట్టుకుపోతాయని సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి అన్నారు. ఇరిగేషన్ అంటే మాఫియాగా మారిందని, ఇక్కడి డబ్బుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోమాలోకి పోయిందని నైనాల గోవర్ధన్ అన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు అన్వేష్‌రెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, తెలంగాణ ప్రజా చైతన్య వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కె.వెంకట్‌నారాయణ, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష, పృథ్వీ రాజ్‌యాదవ్ విఠల్, సోగరా బేగం, నరసింహా, సూర్యకిరణ పాల్గొన్నారు

## ముగిసిన డీఎస్సీ దరఖాస్తుల గడువు

హైదరాబాద్, జూన్ 22 (తీన్మార్ న్యూస్): మెగా డీఎస్సీకి భారీగా అప్లికేషన్లు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 11,062 టీచర్ పోస్టుల కోసం 2,79,956 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పోస్టుకు 25 మంది పోటీ పడుతున్నారు. డీఎస్సీ పరీక్షలు వచ్చేనెల 17 నుంచి ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను నేడో, రేపో రిలీజ్ చేయనున్నారు. గతేడాది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 5,089 టీచర్ పోస్టుల భర్తీకి రిలీజ్ చేసిన నోటిఫికేషన్ ను రద్దు చేసిన కొత్త ప్రభుత్వం ఫిబ్రవరి 29న 11,062 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 4 నుంచి ఈ నెల 20వరకు అప్లికేషన్ల ప్రక్రియ కొనసాగింది. గురువారం రాత్రి వరకూ 2,85,288 మంది ఫీజు చెల్లించగా 2,79,956 మంది దరఖాస్తు చేసుకున్నారు. టెట్ ఫలితాల నేపథ్యంలో డీఎస్సీ అప్లికేషన్లకు స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు ఎడిట్ ఆప్షన్ ఇవ్వగా 74,162 మంది తమ అప్లికేషన్లను ఎడిట్ చేసుకున్నారు. దరఖాస్తుదారుల్లో ఇదివరకే డీఎస్సీ2023కి అప్లై చేసుకున్న 1.77 లక్షల మంది అభ్యర్థులు కూడా ఉన్నారు. కాగా, 2017లో జరిగిన టీఆర్టీలో 8,792 పోస్టులకు 2,77,574 మంది అప్లై చేయగా, ఒక్కో పోస్టుకు 31 మంది పోటీ పడ్డారు. అప్పట్లో పోస్టులు తక్కువ ఉన్నా, పోటీ ఎక్కువగా ఉంది. ప్రస్తుతం పోస్టులు భారీగా ఉన్నా గతం కంటే అప్లికేషన్లు పెద్దగా పెరగలేదు. అయితే, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు భారీగా పోటీ నెలకొన్నది. ఒక్కో పోస్టుకు 56 మంది పోటీ పడుతున్నారు. ఎస్జీటీ పోస్టులకు మాత్రం పోటీ తక్కువగా ఉంది. ఒక్కో పోస్టుకు కేవలం 12 మంది మాత్రమే పోటీలో ఉన్నారు. ఒక్కో పండిట్ పోస్టుకు 25 మంది, ఒక్కో పీఈటీ పోస్టుకు 65 మంది పోటీ పడుతున్నారు.

**పట్నంలోనే ఎక్కువ**

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. ప్రస్తుతం వచ్చిన



అప్లికేషన్లలో అత్యధికంగా హైదరాబాద్ లో 27,027 మంది ఉన్నారు. అత్యల్పంగా మేడ్చల్ జిల్లాలో 2,265 మంది అప్లై చేశారు. ఎక్కువగా నల్గొండలో 15,610 మంది, నిజామాబాద్ లో 13,166 మంది, ఖమ్మంలో 12,970 మంది, వికారాబాద్ లో 12,856, సూర్యపేటలో 11,907, జనగామలో 11,021, నాగర్ కర్నూల్ లో10,651, సంగారెడ్డిలో 10,569 మంది దరఖాస్తు చేశారు. తక్కువగా జయశంకర్ భూపాలపల్లిలో 2,828, ములుగులో 2,908 మంది అప్లై చేశారు. కాగా, ఇటీవల నిర్వహించిన టెట్ లో క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఉచితంగా అప్లై చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ కేటగిరీలో 24,975 మంది పేమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 23,919 మంది దరఖాస్తు చేసుకున్నారు.

## కెయూలో ఒక్క గంట పాటు క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాం



హన్మకొండ కేయూ, జూన్ 22 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీలో “క్లీన్ అండ్ గ్రీన్” అనే ప్రోగ్రాంని ప్రారంభిస్తునట్టు ఇది ప్రతి శనివారం ఒక గంట పాటు పాఠ్యేతర కార్యక్రమంగా నిర్వహించాలని కెయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి శుక్రవారం సర్కులర్ జారిచేసారు. ఇందులో భాగంగా శనివారం హిస్టరీ అండ్ టూరిజం డిపార్ట్మెంట్ యొక్క హెచ్ఓడి డాక్టర్. చిలువేలు రాజకుమార్ ఈ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ప్రారంభించి హిస్టరీ అండ్ టూరిజం డిపార్ట్మెంట్ యొక్క పరిసర ప్రాంతాలలో ఉన్న చెత్త, ప్లాస్టిక్, పనికిరాని మొక్కలని తొలగించడమైనది. ఈ కార్యక్రమాన్ని ఉదయం 10:30 నుండి 11:30 వరకి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అయినా డాక్టర్. ఎం.కె సుమంత్, డాక్టర్. కె.వి.ఎస్ నరేందర్, డాక్టర్. కె నాగేశ్వరావు మరియు కళాశాల సిబ్బంది పాల్గొని క్లీన్ అండ్ గ్రీన్ అయినా పాఠ్యేతర కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్యేశం పర్యావరణ సుస్థిరతను పెంపోందించడం, బాధ్యతయుత భావాన్ని పెంపోందించడం, విద్యార్థులు, సిబ్బందిలో పర్యావరణ ఆందోళన విలువలని పెంపోందించడం.

## రుణమాఫీకి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవద్దు

మొదటి పేజీ తరువాయి

మాఫీ చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన నేపథ్యంలో సోమవారం మార్గదర్శకాలు వెల్లడికానున్నట్లు తెలుస్తోంది. వీటిలో ఎలాంటి సందిగ్ధం లేకుండా స్పష్టంగా ఉండాలని అధికారులను మంత్రివర్గం ఆదేశించింది. పీఎం కిసాన్ యోజన మార్గదర్శకాల్లోని కొన్నింటిని పరిగణనలోకి తీసుకొని, వీలైనంత ఎక్కువ మంది రైతులకు రుణమాఫీని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అటు కేసీఆర్ సీఎంగా ఉండగానే కేంద్ర ప్రభుత్వం సింగరేణి గనులను తొలిసారి వేలం వేసిందని సీఎం రేవంత్ దుయ్యబట్టారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది కాంగ్రెస్ మాత్రమేనని కేటీర్ కు కౌంటర్ ఇచ్చారు. పదేళ్లుగా తెలంగాణ ప్రజల మాటలను బీఆర్ఎస్ పట్టించుకోలేదని ఆయన ట్వీట్ చేశారు. ఓఆర్ఆర్, సింగరేణిని అమ్మేసిన వ్యక్తి ఇప్పుడు హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బొగ్గు గనులను కాపాడి తీరుతామని సీఎం స్పష్టం చేశారు.

## విడుదలైన సీపీగెట్ 2024 పరీక్షల షెడ్యూల్

మొదటి పేజీ తరువాయి

ఉస్మానియా, తెలంగాణ, కాకతీయ, శాతవాహన, పాలమూరు, మహాత్మాగాంధీ, మహిళా యూనివర్సిటీలు, జేఎన్‌టీయూహెచ్ పరిధిలో ఉన్న 297 పీజీ కాలేజీల్లో 51 కోర్సుల్లో ప్రవేశాలకు సీపీగెట్ నిర్వహిస్తున్నారు. మే 18 నుంచి జూన్ 17 వరకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరించారు. రూ.500 ఆలస్య రుసుముతో జూన్ 25వ తేదీ వరకు, రూ.2 వేల ఆలస్య రుసుముతో జూన్ 30 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీపీగెట్ పరీక్షలను జూలై 6వ తేదీ నుంచి కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించనున్నారు. సీపీగెట్ పూర్తి వివరాలను www.osmania.ac.in, www.ouadmissions.com, www.cpget.tsche.ac.in వెబ్‌సైట్లలో చూడొచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా 44,604 పీజీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీపీగెట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీలో ఏ సబ్జెక్టు చేసినా, పీజీలో ఇష్టమొచ్చిన సామాజిక కోర్సుల్లో చేరేందుకు వీలు కల్పిస్తున్నారు. ఎంబీబీఎస్, బీటెక్ విద్యార్థులు కూడా ఎంఏ, ఎంకామ్ వంటి కోర్సుల్లో చేరే వీలుంది. ఎంఏ తెలుగు, ఇంగ్లిష్ కోర్సులకు ఏ గ్రూపుతో డిగ్రీ చేసినా అర్హులే అవుతారు.

**ప్రవేశాలు కల్పించే కోర్సులు**

- ఎంఈడీ ❖ ఎంఏ ❖ ఎంఎల్ఐఎస్సీ ❖ ఎంఎస్‌డబ్ల్యూ
- ఎంహెచ్ఆర్ఎం ❖ ఎంటీఎం ❖ ఎంకామ్ ❖ ఎంపీఈడీ
- ఎంఎస్సీ
- ఎంబీఏ (5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్) మొత్తం 100 మార్కులకు సీపీగెట్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ ఏడాది ఉస్మానియా వర్శిటీ నిర్వహిస్తోంది. ప్రశ్నాపత్రంలో మొత్తం 100 ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు అడుగుతారు. బయోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫోరెన్సిక్ సైన్స్, జెనిటిక్స్ అండ్ మైక్రోబయాలజీ సబ్జెక్టులకు సంబంధించిన పేపర్ పార్ట్–ఎలో కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు, పార్ట్ బిలో ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, జెనిటిక్స్, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీల్లోని ఆప్షనల్ సబ్జెక్టు (బీఎస్సీలో చదివిన) నుంచి 60 ప్రశ్నలు వస్తాయి. బయోటెక్నాలజీ పేపర్‌లో పార్ట్–ఎ (కెమిస్ట్రీ)లో 40 ప్రశ్నలు, పార్ట్–బి (బయోటెక్నాలజీ) లో 60 ప్రశ్నలు అడుగుతారు. ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

## ప్రారంభమైన 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

### కీలక నిర్ణయాలు తీసుకోనున్న కౌన్సిల్



న్యూ ఢిల్లీ, జూన్ 22 (తీన్మార్ న్యూస్): వస్తు, సేవల పన్నుకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం శనివారం ప్రారంభమైంది. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి జీఎస్టీ కౌన్సిల్ శనివారం సమావేశమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు సహా పలు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, అధికారులు హాజరయ్యారు. కాగా, గతేడాది అక్టోబర్ 7న చివరిసారిగా జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఆ సమావేశంలో క్యాసినో, గుర్రపు పందేలు, ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ తర్వాత జరగాల్సిన కౌన్సిల్ మీటింగ్‌ను కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో కేంద్రంలో ఇటీవలే కొత్త ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. కేంద్ర ఆర్థిక మంత్రిగా మరోసారి నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. దీంతో తదుపరి కౌన్సిల్ మీటింగ్‌ను శనివారం నిర్వహించారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# నిరుద్యోగ సమస్యకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

దేశంలో నిరుద్యోగ సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. ప్రతి సర్వేలో మంచి జీతంతో కూడిన సురక్షితమైన ఉద్యోగాలు లేకపోవడమే తమ సమస్య అని దేశ ప్రజలు చెబుతున్నారు. భారతీయ జనాభాలో మూడింట రెండొంతుల మంది పని చేసే వయస్సులో ఉన్నారు. అంటే, వారు 15–65 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు. పని చేసే వయస్సు గల వ్యక్తుల ఈ నిష్పత్తి ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ. అయినప్పటికీ, పని చేసే వయస్సులో ఎక్కువ మంది వ్యక్తులు ఎటువంటి వేతనంతో కూడిన పని దొరకక వారి శక్తి పూర్తిగా వృథా అవుతోంది. వీరిని నిరుద్యోగులుగా పరిగణిస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీగా ఉన్నంత కాలం నిరుద్యోగానికి పరిష్కారం లేదు. సమస్యకు పరిష్కారం లేకపోవడంతో, రాజకీయ పార్టీలు కుల ప్రాతిపదికన రిజర్వేషన్ కోటాల కోసం ప్రజల మధ్య పోటీని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఉన్న కొద్దిపాటి ఉద్యోగాల విషయంలో నిరుద్యోగ యువత తమలో తాము పోట్లాడుకునేలా చేస్తున్నారు. సమస్య మూలాన్ని తొలగించకుండా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదు. యువతకు నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. ప్రతి సంవత్సరం దాదాపు 50 లక్షల మంది యువత శ్రామికశక్తిలో చేరుతున్నారు కానీ వారిలో చాలా మందికి వేతనంతో కూడిన పని దొరకడం లేదు. 2024 జనవరి–మార్చి త్రైమాసికానికి సంబంధించిన తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం దేశంలో 15–29 ఏళ్ల మధ్య ఉన్న ప్రతి ఆరుగురిలో ఒకరు నిరుద్యోగులుగా ఉన్నారు. నిరుద్యోగులందరిలో సెకండరీ పాఠశాల పూర్తి చేసిన యువత నిష్పత్తి 2000లో 54% ఉండగా, అది 2022 నాటికి 66%కి పెరిగింది. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం క్లరికల్ ఉద్యోగాల్లో కొన్ని వందల ఖాళీలను భర్తీ చేయాలని యోచిస్తున్నట్లు ప్రకటించినప్పుడల్లా వేలాది మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, పీహెచ్‌డీలు కూడా ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటారు. అధిక అర్హత కలిగిన యువతలో చాలా తక్కువ మందికి ప్రైవేట్ కంపెనీలలో రెగ్యులర్ ఉద్యోగాలు లభిస్తున్నాయి. మరోవైపున లక్షలాది మంది యువత రైల్వేలో లేదా ఇతర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగం కోసం, ఒకదాని తర్వాత మరొకటి అర్హత పరీక్షలకు సిద్ధమవుతూ, రాస్తూ వృథాగా సంవత్సరాలు గడుపుతున్నారు. ఏటా ఉద్యోగాల సృష్టి కంటే తగ్గుతున్నవే ఎక్కువ. ఈ ఏడాది ఐఐటీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు కూడా ఉద్యోగం కోసం కష్టపడుతున్నారు. అందుబాటులో ఉన్న ఉద్యోగాల పరిమాణం నిలిచిపోవడమే కాకుండా, ఉద్యోగాల నాణ్యత క్షీణిస్తోంది. మెజారిటీ కంపెనీలలో, సాధారణ శాశ్వత ఉద్యోగాల కంటే తాత్కాలిక ఒప్పంద ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ఎక్కువ మంది కార్మికులు ఎటువంటి సామాజిక భద్రత లేకుండా ఎక్కువ గంటలు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయవలసి వస్తుంది. భారీ సంఖ్యలో నిరుద్యోగుల ఉనికి ఉపాధి కార్మికుల వేతనాలను తొక్కివేయడానికి, వారి హక్కులను హరించడానికి కూడా ఉపయోగించబడుతోంది. జీవనం కొనసాగించడానికి ఎక్కువ పని గంటలు పని చేసే పరిస్థితి ఉంది. ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమల స్థాపన ఉనికి లేకపోవడంతో విస్తృత సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు గండి పడింది. నిరుద్యోగం పెరుగుదల రేటు 45 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 2017?18లో 6.1శాతానికి ఎగబాకింది. కోవిడ్ ముమ్మరించిన 2020 ఏప్రిల్?జూన్ త్రైమాసికంలో 20.8 శాతానికి చేరుకొని విలయ నాట్యమాడింది. ఆ కాలంలో పట్టణాల నుంచి పల్లెలకు ఎదురు వలసలు విజృంభించాయి. ఆ విపత్కాలంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం విశేషంగా తోడ్పడింది. ఎంతగా అంటే 2019లో ఈ పథకం ద్వారా 260 కోట్ల వ్యక్తి దినాల ఉపాధి పని కల్పించగా 2021లో అది 390 కోట్ల వ్యక్తి దినాలకు పెరిగింది. భూమిలేని నిరుపేద గ్రామీణ వ్యవసాయ కార్మికులకు పని హక్కును కల్పించడానికి యూపీఏ ప్రభుత్వం ఆవిష్కరించిన ఈ పథకాన్ని బలహీనపరచేందుకు కేంద్రంలోని అధికారపక్షం శతవిధాలా ప్రయత్నించింది. ఈ పథకానికి ఆధార్ అనుసంధానమనే గుదిబండను వేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించినా ఫలితం లేకపోయింది. దీనికి బడ్జెట్‌లో కేటాయింపుల కోత వంటి చర్యలకూ ప్రభుత్వం పాల్పడింది. బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పెద్ద నోట్ల రద్దు పథకం, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) నిరుద్యోగాన్ని, నిర్వ్యాపారాన్ని పెంచాయి. కింది స్థాయి కార్మికుల పనులను హరించివేశాయి. అనాలోచితంగా ప్రకటించిన ఆకస్మిక లాక్ డౌన్ అసంఘటిత రంగ కార్మిక లోకాన్ని కష్టాల కొలిమిలో తోసివేసింది. నిరుద్యోగాన్ని తగ్గించడానికి శాస్త్రీయమైన దారులు అనుసరించని మోదీ ప్రభుత్వం దానిని అంచనా వేయడానికి అంతవరకు గల పద్ధతులను కూడా రద్దు చేసింది. ప్రభుత్వం చేపట్టే వార్షిక ఉద్యోగ నిరుద్యోగ సర్వేకి 2017లో స్వస్తి చెప్పింది. కార్మిక విభాగం (లేబర్ బ్యూరో) మూడు మాసాలకు ఒకసారి నిర్వహించే వ్యాపార సంస్థల సర్వేని కూడా మాన్పించింది. ఆచరణలో నిరుద్యోగం లోతులు తెలుసుకోడానికి ఏర్పాటు చేసిన శాస్త్రీయ పద్ధతులకు నిలువ నీడ లేకుండా చేస్తూ నిరుద్యోగానికి సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులో లేవని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నిస్సహాయత ప్రకటించడం విడ్డూరంగా లేదూ? ఉద్యోగాలు ఎప్పటికీ దొరక్కపోవడంతో విసిగిపోయిన కోట్లాది నిరుద్యోగులు దుర్భరమైన ఆర్థిక బాధలను తట్టుకోడానికి స్వయం ఉపాధులను ఆశ్రయిస్తున్నారని స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా?2023 నివేదిక నిగ్గుదేల్చింది. కార్మికులకు విశేషంగా పనులు కల్పించగల తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి మోదీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' పథకాలను ప్రారంభించింది. ఇవి వచ్చిన తర్వాత 2016?2021 మధ్య తయారీ రంగంలో ఉద్యోగాలు సగానికి పడిపోయాయి. కోవిడ్‌కి ముందే దేశ తయారీ రంగం కునకడం మొదలుపెట్టింది. ఉద్యోగం ముఖం చాటు చేసినప్పుడు మెజారిటీ కార్మికులు నిర్మాణ రంగాన్ని ఆశ్రయిస్తారు. కోట్లాదిమంది దీనిపైనే ఆధారపడి బతుకుతున్నారు. దేశంలో ఆర్థిక వ్యత్యాసాలు బ్రిటిష్ పాలనలో కంటే గత పదేళ్ళలోనే ఎక్కువని ప్రపంచ అసమానతల లాబ్ తరపున ఇటీవల అధ్యయనం జరిపిన నలుగురు ప్రఖ్యాత ఆర్థికవేత్తలు నిర్ధారించారు. చదువుకుంటే ఉద్యోగం వస్తుందనేది ఇండియాలో రుజువు కావడం లేదని, ఉన్నత చదువులు చదివే కొద్దీ కొలువు దూరమవుతున్నదని అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదిక స్పష్టం చేసింది. దేశంలోని నిరుద్యోగుల్లో 83 శాతం మంది యువతేనని వీరిలో 65 శాతం మంది చదువుకున్నవారేనని ఈ నివేదిక వెల్లడించింది.


# డబల్ బెడ్ రూమ్ లో గులాబీ వాటం 80లక్షలు

- డ్రైనేజీ పేరిట కోటి రూపాయలు స్వాహా
- నాసిరకం డబుల్ బెడ్ రూం ఇళ్లలో నరకయాతన
- ఒక్కో ఇంటికి రూ.75వేలు నుంచి 2లక్షల పైసా వసూళ్లు
- పైసా పైసా పోగు చేసి ఇండ్లు కోసం డబ్బులు ఇచ్చింద్రు
- పునాది నిర్మాణంలో నాసిరకం పెద్ద పెద్ద పగుళ్ళు
- గోడలు నెర్రెలు ఎప్పుడు కూలిపోతాయో భయం గుప్పెట్లో
- ప్రజాధనాన్ని దోచుకొని దాచుకున్న మండలం అధికారులు టిఆర్ఎస్ నాయకులు
- చక్రం తిప్పి లక్షల్లో అక్రమ, వసూళ్లు
- గట్టిగా వాన కురిస్తే ఇండ్లలోకి నీరు
- అక్రమార్కుల నుంచి అవినీతి సొమ్మును కక్కించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్





మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, జూన్ 22(తీన్మార్ న్యూస్): కూడు, గూడు, గుడ్డ(ఇల్లు) అనేవి ప్రతి మనిషికీ ప్రాథమిక అవసరాలు. ఇవి ఆత్మగౌరవానికి నిదర్శనాలు. పేదలకైతే ఇంకా ఎక్కువే దాన్నినే ఆసరాగా చేసుకుని బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లను పూర్తి ఉచితంగా ఇస్తున్నామని చెప్పి లబ్ధిదారుల నుండి 70 వేల నుండి 2లక్ష వరకు వసూలు చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ మండిపడ్డారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం కేంద్రంలో సిపిఎం మదనాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని డబల్ బెడ్ రూమ్ లను సిపిఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పేరుకే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తున్నామని పెద్ద పెద్ద మాటలు గొప్పగా చెపుతున్నా ఇళ్ల పరిస్థితి మాత్రం నాసిరకంగా ఉన్నాయని లబ్ధిదారులు లబోదిబో మంటున్నారని ఆరోపణ లు చేశారు. పైసా పైసా పోగు చేసి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కోసం లక్షలలో కమిషన్లు ఇచ్చినరని కోరారు. నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకకుండా కట్టడంతో పెద్ద పెద్ద పగుళ్ళు వచ్చి, గోడలు నెర్రెలు బారి ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితిలో ఉన్నాయని, కనీసం నేటి వరకు కనీస మౌలిక వసతులు కూడా లేవని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. మూడు రోజుల పెద్ద వాన కురిస్తే ఇళ్ళలోకి వర్షపు నీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ధనాన్ని వెచ్చించి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ళలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, అందుకే నాసిరకం ఇళ్ళతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలను తుంగలో తొక్కిపట్టి 80 లక్షలు కొల్లగొట్టినట్లు సర్వత్రా ఆరోపణలు అవుతున్నాయని కోరారు. నిజాయితీగా ఉండాల్సిన గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులు మండలం నాయకులు డబుల్ బెడ్ రూంల వ్యవహారం లో చేతి వాటం ప్రదర్శించారని ఆరోపించారు. అందినకాడికి దొబ్బుకున్నారు. లక్షల్లో వెనుకేసుకున్నారు. డబుల్ బెడ్ రూం లను తమ సొంత ఆస్తిలాగా అధికారులు, నాయకులు డబ్బులు తీసుకొని పట్టా రాసిచ్చారని కోరారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లమీద మురికి నిరు నిల్వ ఉండడం ద్వారా అనారోగ్యాలు గురవుతున్నారు. తక్షణమే ఎమ్మెల్యే, జిల్లా అధికారులు స్పందించి



డ్రైనేజీలు, త్రాగడానికి మంచినీరు, సిసి రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళన పోరాటాల నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ విచారణ చేపట్టి, అక్రమార్కుల నుండి అవినీతి సొమ్మును కక్కించాలని కోరుతు న్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాల్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులుఎం రాజు, మండల కార్యదర్శి వెంకట్ రాములు, నాయకులు వెంకటేష్, చెన్నయ్య, కాలనీ వాసులు, పాల్గొన్నారు.

# రోడ్డు వెడల్పులో ఇల్లు కోల్పోయిన వారికి ప్లాట్లు కేటాయించాలి

**- మంత్రికి వినతి పత్రం అందజేసిన మున్సిపల్ పాలకవర్గం సభ్యులు**



పెబ్బేరు, జూన్ 22(తీన్మార్ న్యూస్): పెబ్బేరు పట్టణ పరిధిలో ప్రధాన సమస్యలు అయినటువంటి సంతస్థలం, రోడ్డు, డ్రైనేజీ, విద్యుత్తు మరియు ఇల్లు కోల్పోయిన వారికి ఇల్లు మొదలుకొని పలు సమస్యల గురించి శనివారం పెబ్బేరుకు విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘా రెడ్డికి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, మరియు పాలక వర్గం సభ్యులు మండల పరిషత్ కార్యాలయంలో వారిని కలిసి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో పెబ్బేరు–వనపర్తి అనుసంధానం చేసే రోడ్డు వెడల్పు చేసి డ్రైనేజీలు నిర్మించుట కొరకు 2 కోట్ల 80 లక్షల రూపాయల వ్యయంతో టెండర్ వేయడం జరిగిందని కానీ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న ఇప్పటి వరకు అగ్రిమెంట్ కావడం లేదని అలాగే రోడ్డు విస్తరణలో భాగంగా ఇల్లు కోల్పోయిన వారికి గత ప్రభుత్వం అందించిన డబల్ బెడ్ రూములను పాక్షికంగా ఇల్లు కోల్పోయిన వారికి ప్లాట్లను వారికి అందించాలని, శాసనసభ ఎన్నికల్లో సంత విషయంలో ఎమ్మెల్యే చేసినటువంటి వాగ్దానాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డికి కూడా వినతి పత్రం అందజేసినట్టు మున్సిపల్ పాలకవర్గం సభ్యులు తెలిపారు.

# నర్సాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి



**- యాదగిరిగుట్ట డిఎంకు వినతీ**

రాజాపేట, జూన్ 22(తీన్మార్ న్యూస్): మండలంలోని నర్సాపూర్ గ్రామానికి విద్యార్థుల సౌకర్యం కోసం బస్సు సౌకర్యం కల్పించాలని యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కు శనివారం తాజా మాజీ సర్పంచ్ నాగిర్తి గోపాల్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఉదయం సాయంత్రం వేళలో విద్యార్థులకు బస్సులు ఏర్పాటు చేయాలని, గతంలోని నైట్ హాల్ట్ సికింద్రాబాద్ బస్సును కూడా పునరుద్ధరించాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలను అకస్మిక తనిఖీ చేసిన డిఐఈఓ





ఆత్మకూర్, జూన్ 22(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మద్దిలేటి శనివారం రోజు అకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా కళాశాలలోని రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల గురించి మరియు ఇంటర్మీడియట్ మార్చ్ 2024 పరీక్ష ఫలితాల ఉత్తీర్ణశాతం గురించి చర్చించారు. నూతన అడ్మిషన్స్ మరియు పెంపుదల కొరకు అధ్యాపకులకు దిశా నిర్దేశం చేశారు. ఇట్టి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డిఎస్ రాజేశ్వరరావు, అధ్యాపకులు భాగ్య వర్ధన్ రెడ్డి, టీజే విశ్వేశ్వర్, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట అభివృద్ధికి నిధులు కేటాయించాలి ఎంపిపి



రామన్నపేట, జూన్ 22(తీన్మార్ న్యూస్): రామన్నపేటలో పలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఉన్న ఖాళీస్థలలలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుచేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని స్థానిక ఎంపిపి పూస బాలమణి భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డిని, ఎమ్మెల్యే వేముల వీరేశంను కోరారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో భారీ వర్షాలకు భవనం అంతా కురుస్తుందని, సరిపడు డాక్టర్లు లేకపోవడంతో రొగులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీగోడ, అతిధిగృహం చుట్టూ ఉన్న ఖాళీస్థలంలో మడిగెల నిర్మాణం చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని ఆమె తెలిపారు. రామన్నపేట రైల్వే స్టేషన్ లో రద్దు అయిన రైళ్లను పునఃప్రారంభించాలని, భువనగిరి–చిట్యాల రోడ్డు వెంట సెంటర్ లైటింగ్, ఏర్పాటు చేయాలని కోరుతూ మెమోరాండం సమర్పించారు.

# మూలమలలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

ఆత్మకూర్, జూన్ 22(తీన్మార్ న్యూస్): ఆత్మకూర్ మండలం మూలమల గ్రామంలో శనివారం రోజు ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని గ్రామంలో రైతులు సంబరాలు జరుపుకున్నారు. ఏరువాక పౌర్ణమి వేడుకల్లో భాగంగా రైతులు తమ ఎద్దులతో గ్రామంలో వీధివీధిన ఊరేగిస్తూ ఎరుకతాడును తెంపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజశేఖర్ రెడ్డి, సైక సహదేవ్, ప్రతాపరెడ్డి, సైక ఆనంద్, సుధాకర్, నరేష్, మాసూమ్, కురుమూర్తి, ఎంపిటిసి లక్ష్మన్న, కాసిం, గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటానికి పాలాభిషేకం

**– హర్షం వ్యక్తం చేసిన రైతులు**
**– మక్తల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజ్ యాదవ్**



ఆత్మకూర్, జూన్ 22(తీన్మార్ న్యూస్): రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం రోజు ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు తులసిరాజ్ యాదవ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమ అభివృద్ధి కోసమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం



రైతులకు ఏకకాలంలో రెండు లక్ష రూపాయలు మాఫీ చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చడం పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం స్థానిక గాంధీ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు సీఎం రేవంత్ రెడ్డి, మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దామోదర్ రావు, రాజశేఖరరెడ్డి, ప్రతాపరెడ్డి, అశోక్, ఎస్.టి.డి శ్రీనివాసులు, మల్లేష్ యాదవ్, రమేష్ యాదవ్, జహంగీర్, అబ్దుల్, ఆనంద్ గౌడ్, మనివర్ధన్ రెడ్డి, ఎమ్.డి అన్వర్, భగవంతు ఎంపిటిసి సోమ్, అంజి, ప్రకాష్ రెడ్డి, రాములు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు లేక అవస్థలో ఆసుపత్రి కార్మికులు....

**– జాడ లేని ఏజెన్సీ కాంట్రాక్టర్**
**– పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి**
**– ఏఐటీయుసి**



ఆత్మకూర్, జూన్ 22(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పారిశుద్ధ్య, భద్రత పేషంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులు ఏడు నెలలుగా జీతాలు లేక అవస్థలో ఉంటే ఏజెన్సీ కాంట్రాక్టర్ మాత్రం జాడా లేదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్ కార్మికులకు ఏడు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆద్వర్యంలో ఆస్పత్రి ఎదుట నిరసన చేపట్టి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టరు వంశీ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ఆస్పత్రి పారిశుధ్య, భద్రత సంరక్షణ నిర్వహణ టెండర్ దక్కించుకున్న వెంకటయ్య సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ కాంట్రాక్టర్ టెండర్ ఎంపిక అయినప్పటినుండి కార్మికులకు ఏనాడు మొత్తం వేతనాలు సకాలంలో చెల్లించలేదని వైద్యశాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రమే ఒకటి రెండు నెలలు వేతనాలు చెల్లింపులు చేస్తున్నారు. తప్పితే దాదాపు రెండు సంవత్సరాలుగా కార్మికులకు వేతనాల వెతలు తీరడం లేదని అన్నారు. మార్చ్ నెలలో 8 నెలల పెండింగ్ వేతనాలకై రాష్ట్ర వ్యాప్తంగా ఆసుపత్రి కార్మికులు చేసిన వారం రోజులు నిరవధిక ఆందోళన నేపథ్యంలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ ప్రత్యేకత తీసుకొని ప్రభుత్వంతో ఆరు నెలల వేతన బడ్జెట్ విడుదల చేయించి కార్మికులకు ఉగాది రంజాన్ పండుగల లోపు చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ వెంకటయ్య సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ కాంట్రాక్టర్ మాత్రం పండుగలకు కార్మికులను పస్తులు ఉంచి ఆరు నెలల చెక్కలు తీసుకున్న కార్మికులకు మాత్రం వారం రోజుల తర్వాత కేవలం నాలుగు నెలల వేతనాలను మాత్రమే చెల్లించారని ఆరోపించారు. ఇప్పటికే కార్మికులకు ఏడు నెలల వేతనాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. అగ్రిమెంట్ ప్రకారం ప్రభుత్వం నుండి బడ్జెట్ రాకపోయినా ప్రతినెల వేతనాలు చెల్లించాలని ఉన్న అమలు చేయడం లేదని అన్నారు. వేతనాలు లేక కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. కార్మికులకు పెండింగ్ వేతనాలు మొత్తం చెల్లించాలని, వెంకటయ్య సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో మెరుపు సమ్మె చేపట్టాల్సి వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు సత్తార్, బాలరాజ్, మోహినిద్దీన్, పార్వతమ్మ, చెన్నమ్మ, నాగమ్మ, బాలకిష్టమ్మ, శైలజా, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకింగ్ మరియు సైబర్ నేరాలపై డిజిటల్ అవగాహన

**– రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కార్యక్రమం**
**– కొత్తకోట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో నిర్వహణ**







కొత్తకోట, జూన్ 22(తీన్మార్ న్యూస్): కొత్తకోట మండల పరిధిలోని కొత్తకోట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్ అభద్రతల తొలగింపు బ్యాంకు వైపు మొదటి అడుగు డిపాజిట్లు మరియు డిపాజిట్ ఖాతాల గురించి తెలుసుకోవడం లావాదేవీలు నిర్వహించడం, డిపాజిట్ ఖాతాలో అదనాపు ప్రయోజనాలు ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ భారతదేశంలో చెల్లింపు మరియు పరిష్కార వ్యవస్థ వయోవృద్ధులకు బ్యాంకింగ్ సౌకర్యం ఇటీవల కల్పించిన సదుపాయాలు వంటి అంశాలపై విపులంగా తెలియజేశారు. అదేవిధంగా సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా అవసరం ఉందని వనపర్తి జిల్లా సైబర్ క్రైమ్ ఎస్ఐ అంజద్ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్ ఎల్డీఎం శ్రీనివాస్, ఎస్సిటిసి ఎఫ్ ఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, గురుకుల కాలేజ్ ప్రిన్సిపాల్ మాలతి, రిసోర్స్ పర్సన్ అంబిక ట్రేట్కనర్స్ శివుడు, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను మరణాలకు ప్రేరేపిస్తున్న కార్పొరేట్ కళాశాలలను సీజ్ చేయాలి

**– అఖిల భారతీయ విద్యార్థి పరిషత్**



ఇబ్రహీంపట్నం, జూన్ 22(తీన్మార్ న్యూస్): కళాశాలల్లో విద్యార్థులను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నటువంటి నారాయణ కళాశాల యజమాన్యం నీ అరెస్ట్ చేసి క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎబివిపి ప్రతినిధి బృందం శనివారం రోజు రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ ని కలిసి వినతి పత్రాని అందజేసారు. రెండు రోజుల క్రితం కోహేడ నారాయణ కళాశాలలో యజమాన్యం ఒత్తిడికి తట్టుకోలేక ఎంపీసీ గ్రూప్ మొదటి సంవత్సరం విద్యార్థి కర్రీ గిరీష్ మరణంపై సమగ్ర విచారణ జరిపించి యజమాన్యంపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. నారాయణ కళాశాలను సీజ్ చేసి,విద్యార్థి మృతికి గల కారణాలపై విచారణ జరిపించి కళాశాలలో చదువుతున్న ఇతర విద్యార్థులకు ధైర్యాన్ని నింపాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఏబీవీపీ ప్రతినిధి బృందం డిప్యూటీ కలెక్టర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సిటి సెక్రటరీ శ్రీకాంత్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్యారి మహేష్, విభాగ్ కన్వీనర్ శ్యామ్ కిరణ్, జిల్లా కన్వీనర్ హనుమాన్ చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్వేష్, నాయకులు సాయి, తేజ, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

# సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ రికవరీ

**– ఎస్సై నరేందర్ ఆధ్వర్యంలో బాధితునికి సెల్ ఫోన్ అప్పగింత**




ఆత్మకూర్, జూన్ 22(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం మోట్లంపల్లి గ్రామానికి చెందిన కావలి రాజు ఈనెల 13వ తేదీన ఆరేపల్లి గ్రామం నుంచి మోట్లంపల్లికి బైక్ పై వెళ్తుండగా తన మొబైల్ ఫోన్ పడిపోయింది. వెంటనే స్థానిక ఆత్మకూర్ పోలీసుల సహాయంతో సీఈఐఆర్ నూతన పోర్టల్ లో అప్లై చేయగా ఆత్మకూర్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధ్యతని ఫోన్ ని శనివారం రోజు ఆరేపల్లి గ్రామంలో ట్రస్ట్ చేసి రికవరీ చేసి బాధితునికి ఎస్సై నరేందర్ మొబైల్ ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేందర్ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా తమ సెల్ ఫోన్ ని ఎవరైనా దొంగలించినా లేదా పోగొట్టుకున్నట్లయితే వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అట్టి నెంబర్ను https://www.ceir.gov.in వెబ్ సైట్ లోకి వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందుపరచాలని అలా చేసినట్లయితే త్వరగా వారి మొబైల్స్ ని పట్టుకోవడం జరుగుతుందని కావున ప్రజలు సి ఐ ఆర్ నూతన అప్లికేషన్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

# కరెంట్ షాక్ తో నారాయణ జూనియర్ కాలేజ్ లో విద్యార్థి మృతి

**– న్యాయం చేయాలని దర్నా నిర్వహించిన ధర్మ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు**



రంగా రెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 22(తీన్మార్ న్యూస్): పెద్ద అంబర్ పేట్ పరిధిలోని కోహెడ నారాయణ కళాశాల యాజమాన్యం ఒత్తిడికి తట్టుకోలేక ఎంపీసీ గ్రూప్ మొదటి సంవత్సరం విద్యార్థి కర్రీ గిరీష్ మృతి చెందాడని కళాశాల ముందు ధర్మ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు శనివారం రోజు దర్నా కార్యక్రమాని నిర్వహించి ఆందోళన చేపట్టారు. కళాశాల యాజమాన్యం తీరుపై మండిపడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ధర్మ స్టూడెంట్స్ యూనియన్ నాయకులతో చర్చించి ఆందోళన విరమింప చేశారు. ఈ ఘటన పై ధర్మ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ కార్తీక్ మహారాజ్ మాట్లాడుతూ ఇది



ముమ్మాటికి నారాయణ జూనియర్ కాలేజ్, ప్రభుత్వం కలిసి చేసిన మానసిక హత్య అని దీనికి బాధ్యత వహించాల్సిందిగా కాలేజీని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చనిపోయిన గిరీష్ కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా కేటాయించాలి. నారాయణ కాలేజీ సంస్థకు ఉన్నటువంటి గుర్తింపును రద్దు చేయాలి. ప్రైవేట్ కళాశాలలో అంబులెన్స్ ని ఏర్పాటు చేయాలి. నారాయణ కళాశాలలో ఉన్నటువంటి విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పజెప్పాలి. నారాయణ కాలేజ్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ధర్మ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు లింగయ్య, మహారాజ్, శివ, రాజు, ప్రసాద్, నరేష్, పవన్, సాయి, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శివరాజ్, ఉదయ్ మహారాజ్, హనుమంతు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలి

**– మనం ప్రజల వెంట ఉంటే పదవులు అవంతట ికవే వస్తవి**
**– మంత్రి జూపల్లి కృష్ణారావు**
**– అధికారులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు**
**– ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**




పెబ్బేరు, జూన్ 22(తీన్మార్ న్యూస్): అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. శనివారం నాడు పెబ్బేరు పట్టణ కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆవుల శైలజ కురుమూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి,మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయం, ఆవరణలో కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని తెలిపారు. ప్రజా పాలన నిర్వహణ ప్రణాళిక రూపొందించాలన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. దశాబ్దాల పోరాటం చేసి సాధించుకున్న



తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంది సమస్యలు, కష్టాలు తీరుతాయని ఎంతో ఆశతో ఉన్నారన్నారు. ప్రజల సమస్యలను తీర్చి వారి ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశ్యంతో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించిందన్నారు. అధికారులు ఏదో మొక్కుబడిగా కాకుండా నిర్లక్ష్యాన్ని వీడి, జవాబుదారీ తనంతో అత్యంత పారదర్శంకంగా పని చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించి ఆ డాటాను డిజిటలైజ్ చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

### అధికారులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

**– ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

అధికారులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం పెబ్బేరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పేదలకు ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను వారికి అందేలా చూడాలన్నారు. ఏ ఒక్క నిరుపేదకు అన్యాయం జరగవద్దన్నారు. తదనంతరం ఎంపీటీసీలకు జడ్పిటిసికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసిల్దార్ తో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని ఆసుపత్రులు, క్లినిక్ లు సీజ్

**– చౌటుప్పల్ లో ఆకస్మిక తనిఖీలు**




భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 22(తీన్మార్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పాపారావు ఆదేశానుసారం ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎల్.యశోద మరియు డాక్టర్ ఎం.సుమన్ కళ్యాణ్ పివోఎన్సిడి, కాటమరాజు ఎంవో లు కలిసి చౌటుప్పల్ మండలాల్లోని పలు ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారము ఏవైతే అనుమతి తీసుకోలేని హాస్పిటల్స్ ఉన్నయో వాటిని గుర్తించి అందులో సాయిరాం ఎముకల ఆసుపత్రి, ప్రియాంకా ఎముకల ఆసుపత్రి, సంజీవిని ఫిజియోథెరపీ ఆసుపత్రి, అర్షమోలల ఆసుపత్రి లను సీజ్ చేశారు. అర్హత గల డాక్టర్ల ద్వారా





ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అర్హత లేని డాక్టర్లు ప్రజల జీవితాలతో చెలగాటం ఆడవద్దని తెలియజేశారు. అర్హత లేని డాక్టర్లు అనుమతి లేని వైద్యశాలలతో ప్రజలకు వైద్యం చేయరాదని తెలియజేసి, అలా వైద్యము చేసినచో వారిపైన కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# జ్ఞానంతో రాజ్యాంగాన్ని సాధించిన మొదటి వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్

**– విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి జూపల్లి ఎమ్మెల్యే మేఘారెడ్డి**



పెబ్బేరు, జూన్ 22(తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలంలోని పాత సూగురు గ్రామంలో ఎంపీపీ ఆవుల శైలజ కురుమూర్తి కృషితో నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని శనివారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. అనంతరం విగ్రహానికి మంత్రి,ఎమ్మెల్యే మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ముందుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషిచేసిన ఎంపీపీ ఆవుల శైలజ కురుమూర్తి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రపంచంలో యుద్ధాలతో సాధించలేనిది, కేవలం జ్ఞానంతో రాజ్యాంగాన్ని సాధించిన మొదటి వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ తండ్రికి వచ్చిన చిన్న ఆలోచన ఆయ నను ప్రపంచ జ్ఞానిగా తీర్చిదిద్దిందని తెలిపారు. అణచివేత, చిన్నచూపునకు గురైనా అంబేద్కర్ ప్రపంచ దేశాలకు వెళ్లి ఎవరూ సాధించలేని ఉన్నత చదువులు చదివి భారతదేశానికి వచ్చి రాజ్యాంగాన్ని రచించి అన్ని వర్గాల మన్ననలు పొందారన్నారు. ప్రస్తుతం రాజ్యాంగాన్ని అమలుచే యడంతో తీవ్రలోపం ఉందని, దీనివల్ల దేశంలో ప్రమాదకర అవకతవకలు జరుగుతున్నాయన్నారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని, నిరంతరం జ్ఞానం కోసం శ్రమిస్తూ తాము తక్కువ కాదనే దృక్పదంలో ఉండాలన్నారు. ఏ వర్గమైనా అంబేద్కర్ జీవిత పాఠాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఈ దేశంలో ప్రతి వారికి కావాల్సిన వ్యక్తి అంబేద్కర్ అని, ఒక వర్గం, కులానికి కాద ని, అందరి కోసం రాజ్యాంగాన్ని రచించిన మహా మేధావని కొనియాడారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ విశేష కృషి చేశారన్నారు. అంబేద్కర్ చూపిన బాటలోనే మనమందరం కూడా నడిచి పేదవారి ఆకలి తీర్చడం కోసం, బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం పనిచేయడమే వారికి నిజమైన నివాళి అన్నారు. త్వరలోనే సూగురు అభివృద్ధి కోసం ప్రత్యేకమైన నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ గ్రామాల మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# కలెక్టర్ కు ఘన సన్మానం

**– బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్**



వనపర్తి ప్రతినిధి, జూన్ 22(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా కు నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ శ్రీ ఆదిత్య సురభి ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి అభినందనలు చెప్పారు. వనపర్తి జిల్లాలో ఉన్నా విద్యాసంస్థలో జరుగుతున్న అన్యాయాలను గిరిజన ఆశ్రమ పాఠశాలలపై దృష్టి పెట్టాలని నియోజకవర్గాలలలో ఉన్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై విద్య వైద్యం అభివృద్ధి పై దృష్టి పెట్టాలని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికై మెరుగైన అభివృద్ధి బాటలో ఉండాలని సహాయపడాలని కలెక్టర్ ను కోరారు. వీరితోపాటు పలువురు నాయకులు, సంతోష్ నాయక్, రాకేష్ నాయక్, సంతోష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని కేటాయించాలి

**– రుద్రసముద్రం రామలింగం తెలంగాణ ఉద్యమకారుడు**



నారాయణ్ పేట జిల్లా ప్రతినిధి, జూన్ 22(తీన్మార్ న్యూస్): నారాయణ్ పేట జిల్లా మక్తల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాములు మాట్లాడుతూ ఇప్పటికీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికీ ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు తెలంగాణలో విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడంలో ప్రభుత్వం యొక్క అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎక్సైజ్ శాఖ పై ఉన్న ప్రేమ విద్యాశాఖ పై ఎందుకు లేదని వారు అన్నారు తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుంటుపడే విధంగా ఉంది ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు విద్యాశాఖకు మంత్రిని కేటాయించలేక పోయిందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ విద్యార్థులకు మేధావుల కు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యా వాలంటరీ వాలంటరీలను కూడా వెంటనే నియమించాలి. ఈ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలు నిర్వహించి ఫలితాలు వచ్చేసరికి పూర్తిగా ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు న్యాయం జరగాలంటే ఏకోపాధ్యాయ పాఠశాలలో బోధన కుంటుపడే విధంగా ఉందని వారు అన్నారు. రాష్ట్రంలో వెంటనే విద్యా వాలంటరీ వ్యవస్థను పునరుద్ధరించి వారికి 25 వేల జీతం ఇచ్చి వారిని విధుల్లోకి తీసుకోవాలని రామలింగం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రామన్నపేట షాది ఖానా ను అభివృద్ధి చేయాలి

**– ఎంపీ, ఎమ్మెల్యే కి వినతి పత్రం అందజేసిన**

**– షాది ఖానా చైర్మన్ ఎండీ జమీరొద్దిన్**



రామన్నపేట, జూన్ 22(తీన్మార్ న్యూస్): పట్టణ కేంద్రంలో గల షాది ఖానా ను అభివృద్ధి చేయాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు ఛామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేములవీరేశంలకి షాది ఖానా చైర్మన్ ఎండీ జమీరొద్దిన్ వినతి పత్రం అందజేశారు. ఈ షాది ఖానా లో సరైన వసతులు లేకపోవడంతో పెళ్ళిలు, పంక్షన్లు, మీటింగ్ లు జరుపుకోవడానికి ఇబ్బంది గా ఉన్నదని అందుకు గాను నిఖా/కళ్యాణ మండపం, బోజన శాల, ప్రహరీ గోడ నిర్మాణం చేయాల్సి ఉన్నదని, దీనికి కావలసిన నిధులు కేటాయించి, పనులు పూర్తిచేయాలని కోరారు.

# మెట్రో సాధనే మొదటి ప్రధాన్యత ఎంపి రఘునందన్ రావు

సికింద్రాబాద్: ఎంపీ అంటే మెట్రో పక్కా చేస్తా అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్ళడం జరిగింది. ఏ నమ్మకంతో నైతే ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో పార్లమెంట్ కు పంపించారో ఆ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మెట్రో సాధనే మొదటి ప్రాధాన్యత గా తీసుకొవడం జరిగిందని మెదక్ ఎంపీ రఘు నందన్ రావు స్పష్టత చేశారు.. బేగంపేట లోని మెట్రో రైల్ భవన్ కు ఎంపీ రఘు నందన్ చేరుకొని మెట్రో ఎండీ రెడ్డిని కలసి మెట్రో రైల్ మియా పూర్ నుండి పటాన్ చెరు వరకు, పటాన్ చేరు నుండి సంగారెడ్డి వరకు పొడిగింపు పనులను వెంటనే చేపట్టాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా, అదే పటాన్ చెరు, సంగారెడ్డి ప్రజలకు లాభం చేకూరే మెట్రో రైల్ లైన్ పొడిగింపు కోసం పని చేస్తానని హామీనివ్వడం జరిగిందని అదే విధంగా ఎన్నికల నోటిఫికేషన్ కన్నా ముందే బీజేపీ ఆద్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు కూడా పెద్ద ఎత్తున ధర్నా చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. మెట్రో లైన్ పొడిగింపు కోసం ప్రతి నెల అధికారులతో టచ్ లో ఉంటానని వెల్లడించారు.

# సామాజిక కార్యకర్త కిరణ్ జీ జన్మదిన వేడుకలు

**– అంగన్వాడీ కేంద్రాలకి కుర్చీల బహుకరణ**



గోదావరిఖని, జూన్ 22(తీన్మార్ న్యూస్): స్థానిక 31 వ డివిజన్ కి చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు నంతాబాద్ కిరణ్ జీ జన్మదిన వేడుకలు పలు అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం కిరణ్ ఆ అంగన్వాడీ కేంద్రాలకు 30కుర్చీలు బహుమతి గా అందజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జస్టిస్ మూమెంట్ జిల్లా అధ్యక్షులు మహేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, జిల్లా ఇన్చార్జి శ్రీను, మాధవి లత, స్థానికులు శ్రావణ్ కుమార్ యాదవ్, గంపల సమ్మయ్య, మల్లేష్, గోపు వీరారెడ్డి, కోదాడ రవి, తదితరులు పాల్గొన్నారు.

# పన్ను చెల్లింపుదారులకు... శుభవార్తే

న్యూఢిల్లీ: ఫైనాన్స్ మినిస్టర్ నిర్మలా సీతారామన్ జూలైలో లోక్ సభలో బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. ఇది ఆమెకు ఏడో బడ్జెట్. మోడీ 2.వ వరకు ఆమె ఐదు పూర్తి స్థాయి బడ్జెట్లు.. ఒక మధ్యంతర బడ్జెట్ (5+1=6) ప్రవేశపెట్టారు. బడ్జెట్ కు మరో నెల ఉన్నందున, నిర్మలా సీతారామన్ ఈ సారి పన్ను చెల్లింపుదారులకు కొంత ఉపశమనం కలిగిస్తారనే అంచనాలు, ఊహాగానాలు, ఆశలు ఢిల్లీ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఆమె తక్కువ పన్ను శ్లాబులతో కొత్త పన్ను విధానాన్ని ప్రకటించిన బడ్జెట్ 2020లో గణనీయమైన పన్ను టాక్స్ పేయర్స్ ను ప్రోత్సహించింది.ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో కొన్ని వర్గాల పన్ను చెల్లింపుదారులకు ఆర్థిక మంత్రి నుంచి శుభవార్త అందే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ వర్గాల ఆధారంగా రాయిటర్స్ నివేదిక ప్రకారం.. వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా కొన్ని వర్గాల వ్యక్తులకు వ్యక్తి గత పన్ను రేట్లను తగ్గించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఏడాదికి రూ.15 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు లభిస్తుందని నివేదిక తెలిపింది.2020లో ప్రవేశపెట్టిన కొత్త పన్ను విధానంలో మార్పులు చేసే అవకాశం కనిపిస్తోంది. కొత్త విధానంలో రూ.15 లక్షల లోపు వార్షికాదాయంపై 5–20 శాతం, రూ.15 లక్షలకు పైగా ఆదాయంపై 30 శాతం పన్ను ఉండబోతోంది. ఉదాహరణకు ఒక వ్యక్తి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షలకు ఐదు రెట్లు పెరిగినప్పుడు వ్యక్తి గత పన్ను రేటు ఆరు రెట్లు పెరుగుతుందని మరో మూలాన్ని ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది.ఆదాయపు పన్ను తగ్గింపు వల్ల వినియోగదారుల చేతుల్లో అదనపు నగదు వినియోగం పెరుగుతుంది. కొన్ని కేటగిరీలకు పన్నులు తగ్గించడం వల్ల మధ్య తరగతికి పొదుపు కూడా పెరుగుతుందని నివేదిక పేర్కొంది.2023–24లో ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, వినియోగం ఆ వేగంతో సంగ వరకు పెరిగిందని నివేదిక తెలిపింది.ఎన్డీయే భాగస్వామ్య పక్షాల మద్దతుతో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రధాని మోడీ ప్రకటించేప్పుడు మధ్య తరగతి పొదుపును పెంచడం, వారి జీవితాలను మెరుగుపరచడంపై తమ ప్రభుత్వం దృష్టి పెడుతుందని చెప్పినందున పన్ను రేట్ల తగ్గింపుపై ఊహాగానాలు వ్యక్తం అవుతున్నాయి. 2024 బడ్జెట్ లో పన్ను విషయంలో పరిశ్రమ అంచనాలుపన్ను చెల్లింపుదారులకు, ముఖ్యంగా పేద వారికి ఆర్థిక మంత్రి సీతారామన్ కొన్ని పన్ను ఉపశమన చర్యలను ప్రకటిస్తారని ఇండియా ఇంక్ ఆశిస్తోంది. ద్రవ్యోల్బణం అధిక స్థాయిలో ఉన్నందున 2024–25 పూర్తి బడ్జెట్ లో తక్కువ శ్లాబులో ఉన్నవారికి ఆదాయపు పన్ను ఉపశమనం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని కొత్తగా ఎన్నికైన సీఐఐ అధ్యక్షుడు సంజీవ్ పురి పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.లోక్ సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ లో, ఆర్థిక మంత్రి పన్ను రేట్లు లేదా శ్లాబుల్లో ఎటువంటి మార్పులను ప్రకటించలేదు. కానీ ఇప్పుడు పన్ను చెల్లింపుదారులు ? ముఖ్యంగా వేతన జీవులు, మధ్య తరగతి ? ఆమె కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆశిస్తున్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**– పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**




యాదగిరిగుట్ట, జూన్ 22(తీన్మార్ న్యూస్): యాదగిరిగుట్ట పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి వారి పాదాల వద్ద, ఆలేరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శనివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఒకే దఫా రుణమాఫీ చేయలని నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషమన్నారు. ఈ సంతోషకరమైన వార్త తోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రైతులు జేజేలు పలుకుతున్నారని, వ్యవసాయం దండగ అనే సందర్భం నుండి వ్యవసాయ పండగల చేసుకునే విధంగా సీఎం చేశారన్నారు. రైతులను అభివృద్ధి చెందవిధంగా ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. ఆలేరు నియోజకవర్గం రైతుల పక్షాన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ధరణిలో తహసీల్దార్, ఆర్డీవోలకు ధరణి లాగిన్

కరీంనగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం భూముల లావాదేవీల కోసం ధరణి పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. అయితే ధరణి అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో కాంగ్రెస్ ప్రభుత్వం...ధరణిపై ఓ కమిటీ వేసింది. ఈ కమిటీ ధరణి పోర్టల్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. ధరణి పోర్టల్ సాంకేత సమస్యలతో రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్న రైతులు, భూయజమానులకు ప్రభుత్వం ఓ గుడ్ న్యూస్ చెప్పింది. ధరణిలోని భూసమస్యలకు పరిష్కారానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో పలు జిల్లాల్లో రెవెన్యూ యంత్రాంగం రంగంలోగి దిగింది.

భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలతో పాటు పాత దస్త్రాలను పరిశీలించాలని రెవెన్యూశాఖ అధికారులు నిర్ణయించుకున్నారు.ధరణి సమస్యలపై కలెక్టర్లపై ఇటీవల సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి... జిల్లాల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి జూన్ చివరి నాటికి సమస్యల పరిష్కారాన్ని ఓ కొలిక్కి తీసుకోవాలని ఆదేశించారు. అయితే గతంలో ధరణి సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్లకు మాత్రమే అధికారం ఉండేది. ధరణి దరఖాస్తులు పెద్ద సంఖ్యలో ఉండడంతో జాప్యం జరగకుండా ఉండేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లకు ధరణి పోర్టల్ లాగిన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీఎల్ఎం, టీఎం–33, మిస్సింగ్ సర్వే నంబర్లు, భూమి హెచ్చుతగ్గులు, నిషేధిత జాబితాలోని భూములు, వారసత్వ భూములు, నాలా కన్వర్షన్, ఎన్నారైల భూములు, కోర్టు కేసుల్లోని భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లు బాధ్యతలు అప్పగించింది. రెవెన్యూ ఆఫీసుల్లో ధరణి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.డ్యాష్ బోర్డులు ఏర్పాటు చేసి ఏ తరహా భూ సమస్యలు ఎక్కువగా పెండింగ్ లో ఉన్నాయని స్పష్టం చేస్తూ రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కలెక్టరేట్తోపాటు ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో డ్యాష్ బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించింది. దరఖాస్తుల పెండింగ్కు కారణాలను డ్యాష్ బోర్డుల్లో ప్రజలకు తెలియజేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ నెలాఖరు నాటికి పెండింగ్ దరఖాస్తులకు ఓ పరిష్కార మార్గం చూపాలని రెవెన్యూ యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత దరఖాస్తుల పరిష్కారం అయితే మరోసారి దరఖాస్తుల ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్తో లక్షలాది కుటుంబాలు భూసమస్యలు ఎదుర్కొంటున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం అంటోంది. ఆ సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్ను పునర్వ్యవస్థీకరించి, భూవ్యవహారాలను అందుకు సంబంధించిన చట్టాల్లో మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు ధరణి పోర్టల్ ప్రక్షాళనకు సత్వర చర్యలు చేపట్టింది. ధరణి పోర్టల్ అమలులో వచ్చిన సమస్యలను అధ్యయనం చేయడానికి ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ భూసంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించి 18 రాష్ట్రాల్లోని ఆర్వోఆర్ చట్టాలని పరిశీలించింది. భూ వివాదాల పరిష్కార కోసం రెవెన్యూ ట్రిబ్యునల్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. భూమికి సంబంధించిన ముఖ్యమైన చట్టాలన్నింటిని కలిపి ఒకే చట్టంగా రూపొందించాలని కమిటీ ప్రభుత్వానికి సూచించింది. ధరణి పోర్టల్ బలోపేతం చేయాడానికి, సామాన్య ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతుంది.

# 27వ తేదీ వరకు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పన పనులను పూర్తి చేయాలి.

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పన పనులను ఈ నెల 27వ తేదీ వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మత్తు పనుల పురోగతిపై విద్యా, పంచాయతీరాజ్, గిరిజన ఇంజనీరింగ్, టిజిఈడబ్ల్యుఐడిసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 265 పాఠశాలల్లో మేజర్, మైనర్ మరమ్మత్తుల పనులు పర్యవేక్షణకు పంచాయతీరాజ్, గిరిజన, టిజిఈడబ్ల్యుఐడిసి ఇంజనీరింగ్ శాఖలకు అప్పగించినట్లు తెలిపారు. మండలాల వారిగా పనులను పురోగతిని అడిగితెలుసుకున్న ఆయన ఈ నెల 27వ తేదీ వరకు అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభమై వారం రోజులు గడుస్తున్న ఇంకనూ పనులు పూర్తీ కాకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతతో మౌలిక సదుపాయాలు కల్పన పనులు చేపట్టిందని పనులలో జాప్యం కాకుండా నిరంతరాయంగా జరిగేందుకు ముందస్తుగా 25 శాతం నిధులు మంజూరు చేశామని తెలిపారు. మరమ్మత్తులకు 14.21 కోట్ల రూపాయలకు పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేశామని అన్నారు. మరమ్మత్తులు పూర్తయిన అన్ని పాఠశాలల్లో తక్షణమే రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఇంకా ఎక్కడైన పనులు ప్రారంభించపోయినట్లయితే తక్షణమే ప్రారంభించాలని, పనుల ప్రగతిపై నివేదికలు అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులపై మరింత ఫోకస్ చేయాలని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మరింత వేగంగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్, పిఆర్ ఈఈ దిలీప్, టిజిఈడబ్ల్యుఐడిసి ఈఈ నరేందర్ రెడ్డి, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారి వీరభద్రం, ఆయా శాఖల డిఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# ఊసూరుమనిపిస్తున్న వానలు

### ఉత్తరతెలంగాణలో దయనీయ స్థితి

వరంగల్: వ్యవసాయ సీజన్ ఆరంభమైంది.. కానీ వర్షాలు మొఖం చాటేయడంతో కరువు మేఘాలు కలవరపెడుతున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అంతటా ఇదే పరిస్థితి.. కనీస వర్షపాతం లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తూ తీవ్ర నిరాశ చెందుతున్నారు.. మరోవైపు గ్రామాల్లో కప్పతల్లి ఆటలు, పొలిమేర దేవతలకు పూజలు చేస్తున్నారు..కరువు మేఘాలు కమ్మేయడంతో ఈసారి పంటలు అయోమయంలో చిక్కుకున్నాయని రైతుల ఆందోళన చెందుతున్నారు. సకాలంలో విత్తనాలు దొరికినా వాన దేవుడి కరుణ లేకపోవడంతో అన్నదాతల్లో నైరాస్యం కనిపిస్తోంది. విత్తిన పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. ఆ విత్తనాలు ఉడిగిపోకుండా కాపాడుకునేందుకు మానవ ప్రయత్నాలు మొదలుపెట్టారు. వారిలోని ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని వెలికితీస్తూ పంటలు కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలో కమ్ముకొస్తున్న కరువు మేఘాలు.. పత్తి రైతుల కంటతడిపెట్టిస్తున్నాయి. ఆరంభ శూరత్వంలా మురిపించిన వర్షాలు అడ్రస్ లేకుండా పోయాయి.. రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు రైతులను కలవరపెడుతున్నాయి. భిన్న వాతావరణంతో జూన్ నెలలో ఇప్పటివరకు కనీస వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.. ఈ ఖరీఫ్ సీజన్లో ఆరంభంలోనే రైతులకు చేదు అనుభవం ఎదురవుతుండడంతో అయోమయం నెలకొంది..ఈ వ్యవసాయ సీజన్లో రాష్ట్ర వ్యాప్తంగా 55 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని అంచనా.. జూన్ మొదటి వారంలోనే దాదాపుగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పత్తి విత్తనాలు విత్తారు. తొలకరి చినుకులను చూసి ఆనందంతో మురిసిపోయారు. కానీ గత 15 రోజుల నుండి చినుకు చుక్క జాడలేదు. అప్పుడప్పుడు ఉరుములు మెరుపులు మురిపిస్తున్నా వాన చుక్కజాడలేదు.. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోటీపడి మరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ఇప్పుడు బిత్తరపోయి ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు..వరంగల్ ఉమ్మడి జిల్లాలో 16 లక్షల 82 వేల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా.. అందులో దాదాపుగా ఆరున్నర లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు జరుగుతుందని అంచనా వేశారు.. ఇప్పటికే పత్తి విత్తనాలు 90% శాతం విత్తారు. కానీ వర్షాలు లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో ఆ విత్తనాలు మొలకెత్తడం లేదు. దీంతో రైతులు పడరాన్ని పాట్లు పడుతున్నారు.. కొన్ని ప్రాంతాల్లో బిందెలు, బకెట్ల ద్వారా నీళ్లు తీసుకువచ్చి ఆ విత్తనాలను తడుపుతున్నారు.. మరికొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీళ్లు తీసుకువచ్చి డ్రిప్పింగ్ పద్ధతిలో విత్తనాలను తడిపి మొలకెట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు

ఇప్పటికే విత్తిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో కొంతమంది రైతులు దిగులతో తలలు పట్టుకున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. జూన్ నెలలో నమోదు కావాల్సిన సాధారణ వర్షపాతం కంటే 43% లోటు వర్షపాతం కనిపిస్తుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.. విత్తిన విత్తనాలను కాపాడుకోవడం కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు..

# ఢిల్లీలో ఎండలు.. 20 మంది మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రజలు కు ఓ వైపు నీటి కష్టాలు..మరోవైపు ఎండలతో అష్టకష్టాలు పడుతున్నారు. ఎండదెబ్బకు జనం పిట్టల్లా రాలిపోతున్నారు. 24 గంటల్లో 20 మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను అద్దం పడుతోంది. వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వడదెబ్బతో ఆస్పత్రులకు వచ్చే బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఆదేశాలు జారీ చేశారు. యూపీలో వడదెబ్బకు 81 మంది ప్రాణాలు కోల్పోయారు. వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు, వేడిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. 50 డిగ్రీల టెంపరేచర్ నమోదయ్యిందేమో అన్న ఫీలింగ్.. ఢిల్లీవాసుల్లో కలుగుతోంది. సగటున 46 డిగ్రీల టెంపరేచర్ రికార్డ్ అవుతున్నట్టు ఐఎండీ అధికారులు తెలిపారు. గత వారం రోజులుగా ఢిల్లీలో యావరేజ్‌గా టెంపరేచర్ 46 డిగ్రీలపైనే ఉంటుందని ఎఓఆ స్పష్టం చేసింది. భానుడి ప్రచండ వేడిమికి జనం పిట్టల్లా రాలిపోతున్నారు. ఎండ తీవ్రత తట్టుకోలేక 46 మందికిపైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మరో 17 మంది వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ఢిల్లీతో పాటు ఉత్తర భారతమంతా హీట్‌వేవ్ జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఢిల్లీ, యూపీ, హర్యానా, ఉత్తరాఖండ్, జార్ఖండ్‌తోపాటు పంజాబ్‌లో వేడిగాలుల తీవ్రత మరింత పెరిగింది. గత 24 గంటల్లో ఒక్క బిహార్‌లోనే 22మంది మృతి చెందారంటే పరిస్థితి ఏ విధంగా ఇట్టే అర్థమైపోతుంది. పెరిగిన ఉష్ణోగ్రతలతో మనుషులే కాదు..పక్షులు కూడా చనిపోతున్నాయి. ఢిల్లీ పరిసరాలతోపాటు హర్యానా, పంజాబ్, యూపీలో అనేక జంతువులు, పక్షులు ఎండ వేడిమి తట్టుకోలేక మృత్యువాత పడుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచే ఢిల్లీలో ఎండత తీవ్రత కన్పిస్తోంది. ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనం జంకుతున్నారు. ఢిల్లీలో ఇలాంటి ఎండలు ఎప్పుడు చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ఎండల తీవ్రతను తట్టుకోవడానికి జనం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఢిల్లీతో పాటు యూపీలో రికార్డు స్థాయిలో టెంపరేచర్ నమోదవుతోంది. ప్రయాగ్‌రాజ్లో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎప్పుడూ చల్లగా ఉండే హిమాచల్ప్రదేశ్ కూడా ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నది. ఇక్కడ 44 డిగ్రీల టెంపరేచర్ నమోదవుతున్నది. సగటు ఉష్ణోగ్రత కంటే 6.7 డిగ్రీలు ఎక్కువ రికార్డ్ అవుతున్నట్టు ఐఎండీ అధికారులు తెలిపారు. జమ్మూకాశ్మీర్, కాంట్రాలోనూ ఎండలు దంచికొడ్తున్నాయి. ఇక్కడ 40.8 డిగ్రీల టెంపరేచర్ నమోదవుతున్నది. జమ్మూలో ఉష్ణోగ్రత 44.3 డిగ్రీలకు టచ్ అయింది. రాజస్థాన్లోని గంగానగర్లో అత్యధికంగా 46.2 డిగ్రీలు రికార్డయింది

# అమెరికాలో ఇద్దరు తెలుగు అమ్మాయిల దొంగతనం

హైదరాబాద్: విలాసాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతోన్న తెలుగు విద్యార్థినులను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. నాలుగు నెలల్లో రెండోసారి ఇలాంటి ఉదంతం బయటపడటం ఆందోళన కల్గిస్తోంది. అమెరికాలో మరో ఇద్దరు తెలుగమ్మాయిలు దొంగతనం కేసులో అరెస్టయ్యారు. ఓ ఆంగ్ల పత్రిక కథనం ప్రకారం డల్లాస్ లోని మాసీ మాల్ లో చోరీకి పాల్పడిన ఇద్దరు భారతీయ విద్యార్థినులు కారం మానసరెడ్డి, పులియాల సింధూజా రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో కారం మానసరెడ్డి గతంలో సైతం పలు దొంగతనం కేసుల్లో అరెస్ట్ అయ్యి బెయిలు పొందినట్లు చెబుతున్నారు. అయినా దొంగతనాలు వీడకుండా ప్రస్తుతం మరో అమ్మాయితో కలిసి షాపింగ్ మాల్ లో దొంగతనానికి ప్రయత్నించి దొరికిపోయింది. వీరిద్దరూ చదువుకునేందుకు అంటే స్టడీ వీసా మీద యూఎస్ వచ్చారు. గత నాలుగు నెలల్లో రెండోసారి తెలుగు విద్యార్థినుల ప్రమేయం ఉన్న ఘటన బయటపడటంతో విదేశాల్లో ఉన్న తెలుగు విద్యార్థుల ప్రవర్తనపై సందేహాలు కలిగేలా చేస్తోంది. విలాసాలకు అలవాటు పడి వారు ఇలాంటి వాటికి పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. మార్చి 19న వీళ్లలాగే అమెరికాలోని ఓ షాపింగ్ మాల్ లో వస్తువులు తీసుకొని బ్యాగుల్లో సర్దేసి కొన్ని వస్తువులకే బిల్లు కట్టి వెళ్లిపోదామని ప్రయత్నించిన భవ్య లింగనగుంట, యామిని వల్లలపూడి అనే ఇద్దరు తెలుగమ్మాయిలు పట్టుబడ్డారు. పోలీసులు వీరి చేతికి బేడీలు వేసి తీసుకెళ్తున్న క్రమంలో వీరిద్దరూ తమను విడిచి పెడితే తాము దొంగతనం చేసిన వస్తువులకు డబుల్ రేటు ఇస్తామని, మరోసారి తప్పు జరగదని పోలీసులతో మాట్లాడుతోన్న వీడియో ఒకటి అప్పట్లో వైరలైంది. ఇలా వరుస ఘటనలు బయటపడటంతో ఇండియాకు తిరిగి వెళ్లేటప్పుడు విలువైన, ఖరీదైన వస్తువులు తెచ్చి చూపించే అమెరికాలోని తెలుగు విద్యార్థులు అక్కడ ఎలాంటి నేరాలకు పాల్పడి వాటిని సంపాదిస్తున్నారో అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

# హర్యానా అసెంబ్లీ ఎన్నికలపై గురి...

ఛండీఘడ్: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుపుకోనున్న రాష్ట్రాలపై భారతీయ జనతా పార్టీ దృష్టి సారించింది. ఆ రాష్ట్రాల్లో పార్టీ స్థితిగతులు, లోటుపాట్లపై ఆత్మపరిశీలన చేస్తోంది. తమకు ఎదురేలేదు అనుకున్న హిందీ హార్ట్‌ల్యాండ్‌లోనే కమలదళానికి ఎదురుదెబ్బలు తగిలాయి. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో ఆశించిన ఫలితాలు సాధించలేక బీజేపీ చతికిలపడింది. ఈ ఏడాది చివర్లో మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలతో పాటు హర్యానాలోనూ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటి నుంచే లోపాలు, పొరపాట్లు గుర్తించి సరిదిద్దకపోతే.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. అందుకే కమలదళం పెద్దలు ఆయా రాష్ట్రాల్లో స్థితిగతులపై అధ్యయనం, మేధోమథనం ప్రారంభించారు. మొత్తం 10 లోక్‌సభ స్థానాలున్న హర్యానా రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెరో 5 సీట్లు గెలుపొందాయి. 2019లో సాధించిన సంఖ్యతో పోల్చితే ఈ రాష్ట్రంలో బీజేపీ బలం సగానికి సగం తగ్గిపోయింది. అప్పుడు ఏకంగా 58.02% ఓట్లతో రాష్ట్రంలోని అన్ని స్థానాలను బీజేపీ క్లీన్ స్వీప్ చేయగా, కాంగ్రెస్ పార్టీ కేవలం 28.42% ఓట్లతో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. కానీ ఈసారి బీజేపీ 46.11% ఓట్లు, కాంగ్రెస్ 43.67% ఓట్లు సాధించి చెరో 5 స్థానాలు గెలుపొందాయి. గణాంకాలను పరిశీలిస్తే కాంగ్రెస్ ఏకంగా 15.25% మేర తమ బలాన్ని పెంచుకోగలిగింది. ఇదే సమయంలో బీజేపీ 11.91% ఓట్లను కోల్పోయింది. ఇది కమలనాథులను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తున్న అంశం. హర్యానాలో బీజేపీ పనితీరుపై కోర్ గ్రూప్ సమావేశం జరిగింది. ఆ పార్టీ జాతీయాధ్యక్షులు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షాతో పాటు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కొత్తగా ఎన్నికల ఇన్‌ఛార్జి, కో-ఇన్‌ఛార్జులుగా నియమితులైన ధర్మేంద్ర ప్రధాన్, బిప్లవ్ కుమార్ దేవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. హర్యానా బీజేపీ కోర్ గ్రూప్ నేతలైన హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ (రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి), కృష్ణపాల్ గుర్జార్, కెప్టెన్ అభిమన్యు, సుధా యాదవ్, హర్యానా ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ ఫణీంద్రనాథ్ శర్మ, సంజయ్ భాటియా, ఆర్గనైజేషన్ ఇన్‌ఛార్జ్ సతీష్ పునియా, కో-ఇన్‌చార్జ్ సురేంద్ర నాగర్ తదితరులు ఈ కీలక భేటీలో పాల్గొని లోటుపాట్లపై లోతుగా చర్చించారు. ముఖ్యంగా అంబాలా, సోనిపథ్ వంటి స్థానాల్లో ఓటమి వారిని కలవరపెట్టింది. అంబాలా బీజేపీకి వరుసగా విజయాలు అందిస్తున్న స్థానం. ఇంకా చెప్పాలంటే రాష్ట్రం మొత్తమ్మీద సురక్షితమైన స్థానంగా బీజేపీ నేతలు భావిస్తారు. అలాంటి చోట ఓటమికి దారితీసిన పరిస్థితులేంటి అన్నదే అగ్రనాయకత్వాన్ని వేధిస్తున్న ప్రశ్న. సుదీర్ఘ చర్చ అనంతరం రాష్ట్రంలోని జాట్ సామాజికవర్గం ఓటర్లలో నెలకొన్న ఆగ్రహం, దళితుల్లో నెలకొన్న అసంతృప్తి పార్టీ విజయావకాశాలను దెబ్బతీశాయని అంచనాకు వచ్చారు. జాట్ల ఆగ్రహానికి కారణాలను అన్వేషించి, వారిని ఆకర్షించేందుకు బీజేపీ త్వరలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాలని చూస్తోంది. ఈ క్రమంలో ఆ రాష్ట్రానికి తదుపరి పార్టీ అధ్యక్షుడిగా జాట్ నేతనే ఎంపిక చేసే అవకాశం కనిపిస్తోంది. మొత్తం పరిస్థితులను ఆకళింపు చేసుకోడానికి హర్యానా రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జిగా నియమితులైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జూన్ 22, 23 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించనున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారు అంటూ కాంగ్రెస్ పార్టీ చేసిన దుష్ప్రచారం ప్రభావంతో దళితులు కొంత దూరమయ్యారని కమలనాథులు గ్రహించారు. యూపీ, రాజస్థాన్, మహారాష్ట్ర సహా దేశవ్యాప్తంగా రిజర్వుడు స్థానాల్లో ఈసారి బీజేపీ దెబ్బతినడానికి ఈ అంశమే ప్రధాన కారణమని భావిస్తున్నారు. హర్యానాలో దళితులు దూరమవడంలో ఈ-గవర్నెన్స్ కూడా ఒక కారణమని తేలింది. ఆన్‌లైన్ విధానం, యాప్‌ల వాడకం గురించి అంతగా తెలియని వర్గాలు సైతం ఏదైనా ప్రభుత్వ పథకాన్ని పొందాలంటే తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో, వెనుకబడిన వర్గాల్లో ఈ చర్య అసంతృప్తికి కారణమైందని కొందరు విశ్లేషిస్తున్నారు. దీన్ని సరిదిద్దేందుకు ఇక నుంచి ఆన్‌లైన్‌తో పాటు పేపర్ మీద దరఖాస్తులు నింపి అందజేసే ప్రక్రియను పునరుద్ధరించాలని నిర్ణయించారు. మొత్తంగా పార్టీకి దూరమైన 12% ఓటర్లను మళ్లీ తిరిగి తమ వద్దకు తెచ్చుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈ రాష్ట్రంలో అక్టోబరు నెలలో హర్యానాలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఈ రాష్ట్రానికి పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్‌ను కో-ఇన్‌చార్జ్‌గా నియమించింది. ఇద్దరికీ లోటుపాట్లను గుర్తించి సరిదిద్దే కీలకమైన బాధ్యతలు అప్పగించింది.

# మౌనం...ఇంకెంత కాలం

హైదరాబాద్: ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో.. నెల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పరాభవం తర్వాత పదేళ్లు తెలంగాణను ఏలిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సైలెంట్ అయ్యారు. అధికారంలో ఉండి అహంకార ప్రదర్శించిన గులాబీ పార్టీని ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బండకేసి బాదారు. లోక్‌సభ ఎన్నికల్లో సున్నా చుట్టేశారు. ఇక లోక్‌సభ ఎన్నికలకు ముందు కేసీఆర్ కూతురు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితను ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్ట్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేసిన కేసీఆర్.. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత మాత్రం పూర్తిగా సైలెంట్ అయ్యారు. మూడు నెలలుగా జైల్లో ఉన్న కవితను కూడా పరామర్శించేందుకు వెళ్లడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పేస్తా, పొరుగు రాష్ట్రాలలో ప్రభుత్వాలను మార్చేస్తా, తెలంగాణలో బీఆర్ఎస్ తప్ప మరే పార్టీనైనా తొక్కేస్తా అంటూ బీరాలు పలికిన కేసీఆర్.. అధికారం కోల్పోయాక తన కూతురు కవితను జైలు నుంచి విడిపించుకోలేకపోతున్నారు. గత ఎన్నికల సమయంలో తన గెలుపుతోపాటుగా ఏపీలో తన మిత్రుడు జగన్ గెలుపు కోసం కూడా సాయమందించిన కేసీఆర్ ఇప్పుడు సొంత పార్టీని కాపాడుకోవడానికి మరొకరిసాయం సాయం కోరాల్సిన పరిస్థితి నెలకొంది. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలని పార్టీ పేరు మార్చిన కేసీఆర్.. పార్టీ నేతల స్థానాలు మార్చి ఆయన స్నేహితుడు జగన్ అధికారం కోల్పోయారు. వారి గెలుపు కలలను ప్రజలు కల్లలు చేశారు. ఓటమి రుచి చూపించారు. మరోవైపు తెలంగాణలో బీఆర్ఎస్ స్థానాన్ని ఆక్రమించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. దీంతో గులాబీ పార్టీలో ఉన్నవారు ఆ పార్టీని వీడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కారు షెడ్డుకు పోయిందని, రెట్టింపు స్పీడ్‌తో మళ్లీ వస్తుందని చెప్పి పార్టీ క్యాడర్‌లో ధైర్యం నింపే పనిచేశారు. కానీ, రెంట్టింపు స్పీడ్ కాదు.. స్టార్టింగ్ ట్రబుల్‌లో చతికిల పడిందని గుర్తించిన క్యాడర్ ఇక ఆ పార్టీలో ఉన్నా లాభం లేదని భావిస్తున్నారు. దీంతో కేసీఆర్ ఇప్పుడు నోరు తెరవడానికి కూడా భయపడుతున్నారని తెలుస్తోంది. ఈ మౌనం ఎన్నాళ్లు అన్నది మాత్రం ఎవరికీ అంతుచిక్కడం లేదు. మౌనం వీడకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైతే పార్టీ ఉనికే ప్రశ్నార్థకమవుతుందని క్యాడర్ ఆందోళన చెందుతోంది.

# కుమార్తెపై అత్యాచారం

హైదరాబాద్: కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కాలయముడయ్యాడు. పాడుపని చేయాలని బలవంతం చేశాడు. ఒప్పుకోని ఆ చిన్నారి పదిమందికి చెప్పి పరువు తీస్తుందని హతమార్చాడు. హైదరాబాద్‌లో జరిగిన ఈ దుర్ఘటన పరిస్థితులు ఎంతలా దిగజారాయో చెబుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా మరిపెడ మండలానికి బానోతు నరేష్ ఫ్యామిలీ బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చింది. మియాపూర్‌లోని నడిగడ్డ తండాలో భార్య, 13 ఏళ్ల కుమార్తెతో కలిసి ఉంటున్నాడు నరేష్. ఫుడ్‌డెలవరీ బాయ్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తరచూ ఫోన్‌లో పోర్న్ వీడియోలు చూసే నరేష్‌కు 13 ఏళ్ల కుమార్తెపై పాడుబుద్ధి పుట్టింది. కొన్ని రోజులు నుంచి ఫోన్ డిస్‌ప్లే పని చేయడం లేదు. దీంతో అతనిలై లైంగిక కోరికలు ఎక్కువ అయ్యాయి. అందులోనూ మందుకు బాగా అలవాటు పడి ఉండటంతో అతని మైండ్ పూర్తిగా పిచ్చి ఆలోచనతో నిండిపోయింది. ఎప్పటి నుంచో కుమార్తెను వక్రబుద్ధితో చూసే నరేష్... ఈనెల 7న ఉదయం కట్టెల కోసం తీసుకెళ్లి బలత్కరించబోయాడు. తండ్రి చేసిన పాడుపనికి చిన్నారి ఆశ్చర్యపోయింది. తేరుకొని కేకలు వేసింది. అక్కడి బయటపడేందుకు పారిపోయింది. తన విస్వరూపం కుమార్తెకు తెలిసిపోయిందని... భార్యతోపాటు బంధువులందరికీ చెప్పేస్తుందని గ్రహించిన నరేష్ ఆమెను హతమార్చాడు. పారిపోతున్న కుమార్తెను గట్టిగా పట్టుకున్నాడు. ముఖంపై కొట్టాడు. తండ్రి కొట్టిన దెబ్బలకు మూర్ఛపోయిన చిన్నారిపై బండరాయితో బాది ప్రాణాలు తీశాడు. మృతదేహాన్ని చెట్ల పొదల్లో పడేసి ఏమీ తెలియనట్టు ఇంటికి వచ్చేశాడు. సాయంత్రానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి స్కూల్ వెళ్లాలని బలవంతం చేయడంతో తన కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ దిశగానే కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు సాగుతుండగానే రోజూ వెళ్లి డెడ్‌బాడీని చూసి వచ్చేవాడు. ఇటు పోలీసు స్టేషన్‌కు వచ్చి తన కుమార్తె ఎక్కడుంది ఏం చేస్తున్నారు వెతకడం లేదంటూ పోలీసులపై ఫైర్ అయ్యేవాడు. ఇంతలో మియాపూర్ పరిధిలోని ఓ నిర్మానుష్య ప్రాంతంలో చిన్నారి డెడ్‌బాడీ ఒకటి ఉందని పోలీసులకు సమాచారం వచ్చింది. వెళ్లి చూస్తే అది నరేష్ కుమార్తెదే. కుటుంబ సభ్యులు కూడా గుర్తించారు. ఆ ప్రాంతంలో సీసీ టీవీఫుటేజ్ చెక్ చేస్తే నరేష్ అసలు స్వరూపం బయటపడింది. ఆ రోజు నరేష్ తన కుమార్తెతో బైక్‌పై వెళ్లి తర్వాత ఒక్కడే రావడాన్ని పోలీసులు గుర్తించారు. నరేష్‌పై అనుమానంతో పోలీసులు తమ స్టైల్‌లో విచారించారు. అంతే ఠక్కున నిజం వచ్చేసింది. తన కుమార్తెను తానే హత్య చేసినట్టు నరేష్ ఒప్పుకున్నాడు. ఆయన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# తూకంలో కోతలు... అదనపు వసూళ్లు

### నాణ్యత ప్రమాణాలు గాలికి ...
### పట్టింపులు లేని అధికారులు
### కానరాని పర్యవేక్షణ....
### జిల్లా కేంద్రమైన మండల కేంద్రమైన....
### మోసాలకు నెలవు

పెద్దపల్లి: అది జిల్లా కేంద్రమైన, మండల కేంద్రమైన పర్వాలేదు... ఇచ్చేవాడు ఎవరైనా మనకు కావాల్సింది డబ్బులు... జనాలు ఎలా పోయినా మాకేంటి.... జీతం డబ్బుల కంటే పెద్ద మొత్తంలో వచ్చే పైసలను ఎవరు వదులు కుంటారు... అనుకుంటున్నారేమో ఆయా శాఖల అధికారులు. ప్రజలకు నాణ్యతతో పాటు మోసం లేకుండాసేవలు అందించాల్సిన అధికారులు దుప్పటి వేసుకొని పడుకుంటున్నారు. హోటళ్ళు, కిరాణ షాపులు, చికెన్ సెంటర్ ఇలా చెప్పుకుంటూ పోతే మోసం చేయడానికి, వినియోగదారులను దోచుకొని జేబులు గుల్ల చేయాడానికి నిత్యం సదరు వ్యాపారస్తులు ఎదురు చూస్తూనే వున్నారు. ప్రజలకు ఏది నాణ్యమైనదో, తెలియక పోగా షాపుల వద్ద గ్రేడ్ ల వారిగా బోర్డులు పెట్టాల్సి ఉన్నా ఏ ఒక్క షాపు ముందు కనిపించడం లేదు. మరి అధికారులు ఈ విషయాలు ఎందుకు పట్టించుకోవడం లేదు. వినియోగదారులకు సరైన అవగాహన ఎందుకు కల్పించడం లేదు. పెట్రోల్ పంపుల్లో కల్తీ, పప్పు దినుసుల్లో కల్తీలు, చివరకు నిత్యావసరం వస్తువుల్లో కల్తీ జరుగుతున్నా సదరు శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదు. వినియోగదారులు పిర్యాదు చేస్తే కానీ స్పందించనంత పని వారికేముందో ఆ దేవునికే తెలియాలి. వారు చేయాల్సిన పని నాణ్యమైన వస్తువులు వినియోగదారులకు అందేలా చూడాలి. కానీ వీరు చేస్తున్నదేమిటి. వినియోగదారులకు కాకుండా వ్యాపారులకు వంతపాడటమే వీరి డ్యూటీనా. జిల్లాలోనే ఇలా ఉంటే మండల, గ్రామస్థాయిల్లో అధికారుల పనితీరు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువును ఎంఆర్ పీ రేటుకు తీసుకొని, బిల్లు ఇవ్వాల్సి ఉన్నా ఎక్కడా కూడా ఇది జరగడం లేదు. దీని వల్ల ప్రభుత్వ ఆదాయనికి పెద్ద మొత్తంలో గండి పడుతుందనే చెప్పాలి. ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి సేవ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తడం లోని ఆంతర్యం ఏమిటో సదరు అధికారులు చెప్పాలి. జిల్లా కేంద్రానికి, మండల కేంద్రాలకు అనుకొని ఉన్న ఊర్లలో మొదలుకొని, ప్రతి గ్రామ పంచాయతీ లలో ప్రతి కిరాణా షాపుల్లో ప్రతి వస్తువు మీద ఎం ఆర్ పీకంటే ఎక్కువ మొత్తంలో తీసుకుంటున్నారు. శీతల పానీయాల మీద కూలింగ్ చార్జీల పేరుతో అధిక మొత్తం వసూలు చేస్తున్నారు. అలాగే

గత సంవత్సరం కాలం నుండి జిల్లా కేంద్రంలోని చికెన్ సెంటర్ నిర్వాహకులు సిండికేట్ గా మారి, దోచుకుంటున్నా పట్టించు కోకవడం, దీనికి తోడుగా తూకం వేయడంలో హస్త వాసి ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. ఇలా నిత్యం ప్రజలను ఏదో ఒక చోట దోపిడీ చేయడంతోపాటు నాణ్యమైన వాటిని అందించడంలో కూడా మోసాలలకు తెగబడు తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించడంతో పాటు వినియోగదారులను చైతన్యం చేసే కార్యక్రమాలు, వారికి న్యాయమైన సేవలు అందించాలని పలు వర్గాల ప్రజలు కోరుతున్నారు.

# దశలవారీగా రుణమాఫీ..!

### మొదట రూ.లక్ష తర్వాత రూ.లక్షన్నర వరకు రూ.రెండు లక్షల వరకు అప్పు ఉన్న వారికి తదుపరి రెండు విడతలో...!

హైదరాబాద్: జులై మొదటి వారం నుంచి పంద్రాగస్టు వరకు అమలు చేసే యోచన. ఒక రైతుకు. ఐదు ఎకరాలకు మాత్రమే రైతుభరోసా.! వచ్చే నెల మొదటి వారం నుంచి రైతు రుణమాఫీని దశలవారీగా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అమలుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు, నిధుల సమీకరణ తదితర అంశాలపై ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 15 కల్లా రుణమాఫీని అమలు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గత కొన్ని రోజులుగా ఆర్థిక శాఖ అధికారులతోనూ, మంత్రివర్గ సహచరులతోనూ దీనిపై విస్తృతంగా చర్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రూపొందించిన మార్గదర్శకాలను కూడా అధ్యయనం చేసిన ప్రభుత్వం, రుణమాఫీ అమలులో కేంద్ర మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీని ప్రకారం. సంస్థలకు ఉన్న భూములకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారికి, ప్రస్తుత, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత కేటగిరీల్లోని ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, చార్టర్డ్ ఎకౌంటెంట్లు. ఇలా పలు రంగాలకు చెందిన వారు భూములపై తీసుకొన్న రుణానికి మాఫీ ఉండదు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకొన్న తర్వాత సుమారు 26 లక్షల రైతు కుటుంబాలకు రుణమాఫీ అమలు చేయాల్సి రావచ్చని అంచనా వేస్తున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం జులై మొదటి వారం నుంచి దశలవారీగా అమలు చేసే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. మొదట రూ.లక్ష వరకు ఉన్న రుణాన్ని మాఫీ చేయనున్నట్లు తెలిసింది. దీనికి సుమారు రూ. ఆరు వేల కోట్లు అవసరమని సమాచారం. తర్వాత రూ. లక్షన్నర వరకు అమలు చేసే అవకాశం ఉంది. దీనికి మరో రూ.6,500 కోట్లు అవసరమని సమాచారం.

ఈ రెండు దశల్లో సుమారు 16 లక్షల రైతు కుటుంబాలకు రుణమాఫీ అమలవుతుందని తెలిసింది. రూ.రెండు లక్షల వరకు ఉన్న వారికి తర్వాత రెండు దశల్లో అమలు చేయనున్నట్లు సమాచారం. జులైలో కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, మిగిలిన రుణ మాఫీ అమలుకు నిధులను సమీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### సాగు చేసే రైతుకు మాత్రమే రైతుభరోసా,

రైతుభరోసా అమలుకు సంబంధించిన మార్గదర్శకాలపైనా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గుట్టలు, కొండలు, రియల్ ఎస్టేట్ లేఅవుట్ల లాంటివన్నీ మినహాయిం చనున్నారు. సాగు చేసే రైతుకు మాత్రమే రైతుభరోసా దక్కాలనేది ప్రభుత్వ ఉద్దేశమని, దీనికి తగ్గట్లుగానే మార్గదర్శకాలుంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎన్ని ఎకరాల భూమి ఉన్నా, ఒక రైతుకు ఐదు ఎకరాలకు మాత్రమే రైతుభరోసాను పరిమితం చేయను న్నట్లు తెలిసింది.

# నీవు నేర్పిన పునరేకీకరణే... నీరజాక్ష...

వరంగల్, నిజామాబాద్: తెలంగాణలో రాజకీయ పునరేకీకరణకు రంగం సిద్ధమవుతోంది. గత రెండు టర్మ్ లలో కేసీఆర్ పాటించిన సంప్రదాయాన్నే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలనుకుంటోంది. ఒక్కరు కాదు ఇద్దరు కాదు.. అసెంబ్లీ బడ్జెట్ సెషన్ కంటే ముందే బీఆర్ఎస్ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలను చేర్చుకునేందుకు రంగం రెడీ చేసింది. ఇప్పటికే వారందరితో మాట్లాడి రెడీ చేసి పెట్టారన్న ప్రచారం జోరందుకుంది. గులాబీ పార్టీకి గడ్డుకాలం ఎదురవబోతోంది. ఆ పార్టీ ఏది ముట్టుకున్నా కలిసి రావడం లేదు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా నాలుగున్నరేళ్ల టైం ఉంది. సో ఇప్పుడు గులాబీ బాస్ ముందున్న అతిపెద్ద సవాల్ ఏంటంటే.. తమ పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోవడం. ఇప్పటికైతే ఎంపీలెవరూ ఆ పార్టీ నుంచి గెలవలేకపోయారు. సో ఉన్న ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి బుజ్జగింపులు చేస్తున్నట్లుగా ప్రచారమైతే జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నారంటున్నారు. అది కూడా వచ్చే నెల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందే ఇది జరిగిపోయేలా ప్లాన్ నడుస్తోందంటున్నారు. పొలిటికల్ సర్కిల్స్ లో ఇప్పుడు జరుగుతున్న ప్రచారం ఏంటంటే.. బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్ లో విలీనం అవుతుందంటున్నారు. అయితే ఓసారి లెక్కలు ఎలా ఉన్నాయో చూద్దాం. గత అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ 39 సీట్లు గెలిచింది. అయితే ఇందులో కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఉన్న లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో బైపోల్ వచ్చింది. ఆ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిచింది. సో సంఖ్య 38కి తగ్గింది. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఫైనల్ గా గులాబీ పార్టీకి ఇప్పుడు 35 మంది ఎమ్మెల్యేలు మిగిలారు. ఇందులో 22 మంది హస్తం పార్టీలోకి వస్తే బీఆర్ఎస్ఎల్పీ విలీనమవుతుంది. ఇప్పటి లెక్క ప్రకారం 12 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హస్తం పార్టీలో జాయిన్ అయ్యేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇంత చేసినా విలీనానికి మరో 10 మంది ఎమ్మెల్యేలు అవసరం. సో విలీనానికి టైం ఉన్నా.. ప్రస్తుతానికైతే 12 మంది ఎమ్మెల్యేలపై హస్తం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ అస్త్రాన్నైతే ప్రయోగించింది. నిజానికి హస్తం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టడానికి చాలా కారణాలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుంది అని అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ నేతలు పదే పదే కామెంట్లు చేస్తూ వచ్చారు. వీటిపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా వార్నింగ్ కూడా ఇచ్చారు. అయినా ఈ కోరస్ తగ్గలేదు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరు చూసి వచ్చే వారికి డోర్లు ఓపెన్ చేసి ఉంచాలని డిసైడ్ అయ్యారు. నిజానికి పార్టీ మారాలనుకుంటున్న వారి గురించి తెలుసుకున్న కేసీఆర్ వారిని బుజ్జగించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇంకో నాలుగున్నరేళ్లు కళ్లు మూసుకుంటే వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని నచ్చజెబుతున్నారు. అయితే గత పదేళ్లలో అధికారంలో ఉన్నప్పుడు తమ సెగ్మెంట్ కు, నమ్ముకున్న కార్యకర్తలకు ఏమీ చేయలేకపోయారని అసంతృప్త ఎమ్మెల్యేలు చెబుతున్న మాట. నిజామాబాద్ జిల్లా నుంచి ఓ సీనియర్ ఎమ్మెల్యే.. హస్తం పార్టీలో జాయిన్ అవ్వాలని డిసైడ్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆహ్వానానికి ఓకే చెప్పినట్లు చెబుతున్నారు. అటు కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కూడా కాంగ్రెస్ గూటికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లుగా తెలిసింది. అయితే క్యాబినెట్ బెర్త్ ఇవ్వాలని కోరుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. హైకమాండ్ ఓకే చేస్తే.. ఈ చేరిక జరుగుతుందంటున్నారు. అటు మహబూబ్ నగర్ జిల్లాలో మరింత బలోపేతం అవ్వాలని కాంగ్రెస్ అనుకుంటోంది. ఇప్పటికే పాలమూరు లోక్ సభ స్థానంలో హస్తం పార్టీ గెలవలేకపోయింది. అటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంలోనూ విజయం సాధించలేదు. దీంతో అక్కడ ఎమ్మెల్యేలపై ఆపరేషన్ ఆకర్ష్ అస్త్రం ప్రయోగించారు. పార్టీని పాలమూరులో మరింత బలోపేతం చేసుకునేలా ప్లాన్ చేశారు. అటు మెదక్ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు హస్తం పార్టీలో జాయిన్ అయ్యేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే అందులో ఒకరు క్యాబినెట్ బెర్త్ అడుగుతున్నట్లుగా చెబుతున్నారు. ఇంకోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు.. వారి రాకను అడ్డుకుంటున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎఫెక్ట్ చూపించలేకపోయింది. మొన్నటి కంటోన్మెంట్ బైపోల్ తో పుంజుకున్నా.. మిగితా ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ద్వారా జీహెచ్ఎంసీ పరిధిలో బలం పెంచుకోవాలనుకుంటోంది. వచ్చే ఏడాది గ్రేటర్ ఎన్నికలు జరగనుండడంతో ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ లో జాయిన్ కావాలనుకుంటున్న వారు కూడా హస్తం పార్టీలో ఉన్న తమ పాతమిత్రులను సంప్రదిస్తూ బెర్త్ కన్ఫామ్ చేసుకునే పనిలో ఉన్నారంటున్నారు. గ్రేటర్ పరిధి నుంచి నలుగురు గులాబీ ఎమ్మెల్యేలు హస్తంతో టచ్ లో ఉన్నారంటున్నారు. కాంగ్రెస్ లోకి వచ్చే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కోసం రకరకాల పదవుల తాయిలాలను రెడీ చేశారంటున్నారు. విన్ విన్ సిచ్యువేషన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారంటున్నారు. అయితే పార్టీ మారాలనుకుంటున్న ఎమ్మెల్యేలు తమకు బీఆర్ఎస్ హయాంలో ఎదురైన చేదు అనుభవాలను, సహకారం అందించని విషయాన్ని, కేసీఆర్ దర్శనం లేకపోవడాన్ని గుర్తు చేసుకుంటున్నారట. ఇంకోవైపు బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలకు చెక్ పెట్టేలా హస్తం పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందంటున్నారు. నిజానికి కొందరు గులాబీ నేతలు తమ వ్యాపారాలు కాపాడుకునేందుకు, కేంద్ర దర్యాప్తు సంస్థల రెయిడ్స్ లేకుండా ఉండేందుకు జాగ్రత్త పడుతూ బీజేపీలోకి ప్రచారం జోరందుకున్న టైంలో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ ను స్పీడప్ చేసిందంటున్నారు. అటు మాజీ మంత్రి హరీష్ రావు తాను ఏ పార్టీలోకి వెళ్లడం లేదని క్లారిటీ ఇచ్చుకున్నారు. తప్పుడు ప్రచారం చేస్తే లీగల్ నోటీసులు ఇస్తానంటున్నారు.

# రోజుకు 191 కోట్లు...

హైదరాబాద్, పాత ప్రభుత్వం చేసిన అప్పులు ఓవైపు.. తాజాగా చేస్తున్న అప్పులు మరోవైపు.. ఇక అప్పులకు కడుతున్న వడ్డీలు ఇంకోవైపు. గతంలో, ఇప్పుడు ఇబ్బడిముబ్బడిగా తెస్తున్న అప్పులు రేవంత్ సర్కార్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు నిధులు సమీకరించుకుంటూనే పాత అప్పులకు వడ్డీలు కట్టడం తెలంగాణ ప్రభుత్వానికి సవాల్ గా మారింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి గత ప్రభుత్వం చేసిన అప్పులు భారంగా మారాయి. సీఎంగా రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం అప్పులు దాదాపు 7లక్షల కోట్ల రూపాయలు ఉండగా.. వాటికి వడ్డీలు కట్టడం తలకు మించిన భారం అవుతోంది. పాత అప్పులకు ప్రతిరోజూ దాదాపు 191 కోట్ల వరకు అసలు, వడ్డీ చెల్లిస్తుందట రేవంత్ సర్కార్. డిసెంబర్ 7న కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఆరు నెలల్లో పాత అప్పులకు సంబంధించిన దాదాపు 38వేల కోట్ల వరకు అసలు ప్లస్ వడ్డీ చెల్లించిందని అధికారులు చెబుతున్నారు. అసలే జీతాలు, సంక్షేమ పథకాల అమలు కోసం అవస్థలు పడుతోన్న రేవంత్ ప్రభుత్వానికి.. పాత అప్పులు తలకు మించిన భారంగా మారాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అప్పులతో ఇబ్బందులు పడుతూనే కొత్త అప్పులు చేస్తోంది రేవంత్ సర్కార్. డిసెంబర్ నుంచి జూన్ 17వ తేదీ వరకు రేవంత్ ప్రభుత్వం 25వేల 118 కోట్ల రూపాయల అప్పు తీసుకుంది. అయినా ఖజానా ఎప్పుడూ ఖాళీగానే కనిపిస్తోందట. ఉద్యోగుల జీతాల నుంచి మొదలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తోడు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు వేల కోట్ల రూపాయలు కావాలి. అందులో మరీ ముఖ్యంగా రైతు రుణమాఫీ, రైతు భరోసాకు దాదాపు 40వేల కోట్ల రూపాయలు అవసరమని అంచనా వేస్తున్నారు. ఈ రెండు పథకాల కోసం అప్పులు చేయడం తప్ప మరో గత్యంతరం లేదు. హైదరాబాద్‌లో విలువైన భూములను బ్యాంకులకు తాకట్టు పెట్టి అప్పు తీసుకునే ప్రయత్నం చేస్తోంది తెలంగాణ ప్రభుత్వం. ఇలా పాత అప్పులకు వడ్డీలు కడుతూ.. కొత్త అప్పులు చేస్తూ.. పాలనను నెట్టుకొస్తుంది రేవంత్ సర్కార్. మరి ఎంతకాలం ఇలా అప్పుల మీదే ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతారన్నది మాత్రం ఆసక్తికరంగా మారింది.

# ఆర్టీసీ ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ లో అవకతవకలు

హైదరాబాద్: టీజీఎస్ఆర్టీసీ ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ విధానంలో నిబంధనలు పాటించలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. టెండర్లు పిలవకుండా కోట్లాది రూపాయల కాంట్రాక్ట్ ను ఓ కంపెనీకి కట్టబెట్టారని బీఆర్ఎస్ ఆరోపించింది. దీనిపై టీజీఎస్ఆర్టీసీ వివరణ ఇచ్చింది. అయితే తాజాగా టీజీఎస్ఆర్టీసీ వివరణపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ మరోసారి లేఖ రాశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ కోసం ఏ టెండర్ లేకుండా ఓ కంపెనీకి కట్టబెట్టారనడానికి టీజీఎస్ఆర్‌టీసీ యాజమాన్యం విడుదల చేసిన వివరణతో స్పష్టం అవుతుందని ఆరోపించారు. ప్రభుత్వ కమిటీ మార్చి 4న చర్చలు జరిపిందని లెటర్ ఆఫ్ ఇంటెంట్ స్పష్టంగా పేర్కొందని, అయితే ఫిబ్రవరి 29న మునుపటి టెండర్‌ను రద్దు చేసినట్లు ప్రభుత్వం పత్రికా ప్రకటన పేర్కొంది. ఆ తర్వాత టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారుల బృందం దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లి, ప్రభుత్వ అధికారులను కలిశారు. ఇతర రాష్ట్రాల్లోని అధికారులు, వారి అభిప్రాయాలను తీసుకుని, సాంకేతిక నైపుణ్యం, నాణ్యత, కార్యకలాపాలు, ఆర్థిక ఇతర అంశాలను అధ్యయనం చేసి, ఆపై చలో మొబిలిటీకి అనుమతి ఇచ్చారు. టీజీఎస్ఆర్టీసీ ప్రతినిధి బృందం కేవలం 3 రోజుల్లో అధ్యయనం ఎలా ముగించగలరు, వారు ఎన్ని రాష్ట్రాల్లో పర్యటించారు? ప్రతినిధి బృందంలోని సభ్యులు ఎవరు, వారు ఎన్ని రాష్ట్రాల్లో పర్యటించారు, వారు ఏ అధికారులను కలిశారు, 2022లో ఇచ్చిన కాంట్రాక్ట్‌ను 2023లో రద్దు చేశారు. కానీ రద్దు చేసిన తర్వాత కేవలం 3 రోజుల్లో మరో నిర్ణయం తీసుకున్నారు. ఈ కాంట్రాక్టును ఫలానా కంపెనీకి గిఫ్ట్ గా ఇవ్వాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ముందుగానే ఉందనే అనుమానం వస్తుంది'' అని బీఆర్ఎస్ ప్రశ్నించింది. టీజీఎస్ఆర్టీసీ ప్రెస్ నోట్ ప్రకారం ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ కోసం 2022లో 6 కంపెనీలు పోటీ పడ్డాయి, 2024లో కేవలం 3 కంపెనీలు మాత్రమే పోటీ పడ్డాయి, ఆ కంపెనీలు ఏవి? చలో మొబిలిటీ బిడ్డింగ్‌లో పాల్గొందా? ప్రభుత్వ నోట్‌లో పేర్కొన్న విధంగా ఏ కంపెనీ అవసరాలను తీర్చకపోతే, సాధారణంగా పేరున్న కంపెనీలు టేబుల్‌పై చర్చలు జరపడానికి ఇష్టపడవు. అప్పుడు ఆన్‌లైన్ టెండర్లకు ప్రాధాన్యత ఇవ్వకూడదు, గ్లోబల్ టెండర్లను ఎందుకు పిలవలేదు? టెండర్లు, కొనుగోళ్లకు ప్రముఖమైన టీఎస్టీఎస్(తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీస్) ఎందుకు ఉపయోగించలేదు? బస్ స్టాల్స్‌లో షెడ్‌ల నిర్మాణాలు, బస్ డిపోల్లోని స్టాల్స్ వంటి తక్కువ మొత్తాలకు కాంట్రాక్టులు ఆన్‌లైన్‌లో ఉంచుతున్నప్పుడు, కోట్లాది రూపాయల విలువైన కాంట్రాక్టును ఆన్‌లైన్ ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పారదర్శకంగా ఎందుకు చేయలేదు?'' అని బీఆర్ఎస్ ప్రశ్నించిందిటీజీఎస్ఆర్టీసీ ప్రెస్ నోట్‌లో రాష్ట్ర ప్రభుత్వం లేదా రవాణా మంత్రికి ఎటువంటి పాత్ర లేదని పేర్కొంటూ రవాణా మంత్రిని రక్షించే ప్రయత్నం ఉంది. టీజీఎస్ఆర్టీసీ ఒక కమిషన్ కాదు, ఇది ప్రభుత్వంలో విలీనం చేసిన కార్పొరేషన్. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి బ్యూరోక్రాట్‌లు కూడా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఉన్నారని గమనించాలి. రాష్ట్ర ప్రభుత్వానికి లేదా రవాణా మంత్రికి సంబంధం లేదని మీరు చెబితే, ఇంత పెద్ద కాంట్రాక్ట్ బోర్డుకు తెలియకుండా ఉంచారా అనే అనుమానం వస్తుంది" అని బీఆర్ఎస్ అభిప్రాయపడింది. మహాలక్ష్మి పథకం పన్ను చెల్లింపుదారుల డబ్బుతో పనిచేస్తోంది, పురుష ప్రయాణికులు టికెట్లు కొనుగోలు చేయడంతో కొనసాగిస్తున్నారు. మహాలక్ష్మి పథకం ముసుగులో ప్రభుత్వం ఒక నిర్దిష్ట కంపెనీకి లబ్ధి చేకూర్చడం ద్వారా బహిరంగంగా స్కామ్ చేస్తుంది. కర్ణాటక ప్రభుత్వం అదే మహాలక్ష్మి పథకం కోసం శక్తి స్మార్ట్ కార్డ్‌లను జారీ చేసింది. వాళ్లు ఈ-గవర్నెన్స్ పోర్టల్ ద్వారా టెండర్ ప్రక్రియను కూడా నిర్వహించారు. దానిని అధ్యయనం కోసం ఎందుకు పరిగణించలేదు. హైదరాబాద్ మెట్రో ఇప్పటికే యూపీఐ, స్మార్ట్ కార్డ్ సేవలతో ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్‌ని ఉపయోగిస్తోందని తెలియకపోవడం ఆశ్చర్యం కలుగుతుంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు జీరో టిక్కెట్‌ను జారీ చేస్తారు. అయితే కంపెనీ దాని కమిషన్‌ను పొందుతుంది. అందుకే ఒప్పందంలో మహాలక్ష్మి ప్రయాణికులతో పాటు పురుషులు కొనుగోలు చేసిన టికెట్లతో 30 లక్షల టికెట్ లావాదేవీలను పేర్కొన్నారు. మహిళా పథకంలో అవినీత జరగకుండా పారదర్శకత పాటించడం ప్రభుత్వ బాధ్యత. కాంగ్రెస్ ప్రభుత్వం తరపున మొత్తం ప్రెస్ నోట్ కొన్ని ప్రయోజనాలకు అనుకూలంగా వ్యత్యాసాలు, నిబంధనల ఉల్లంఘనలను వివరిస్తుంది. నోట్ షీట్/కాంట్రాక్ట్ ఫైల్ నిర్దిష్ట పత్రాలు, బిడ్డర్ల వారి కొటేషన్లు, అన్ని వివరాలు, ఉన్నత స్థాయి కమిటీ నివేదికలు, కమిటీ సభ్యుల పేరు, హోదా, మార్చిలో కార్పొరేషన్ నిర్వహించిన వివిధ అధ్యయన నివేదికలను వీక్షించడానికి బీఆర్ఎస్ ప్రతినిధి బృందాన్ని అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని క్రిశాంక్ అన్నారు. ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం అమలు విషయంలో చేస్తోన్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని టీజీఎస్ఆర్టీసీ పేర్కొంది. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకు బోర్డు అనుమతితోనే ఈ వ్యవస్థను సంస్థ అమలు చేస్తుందని తెలిపింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని చేస్తోన్న నిరాధారమైన ఆరోపణలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఖండిస్తోందని తెలిపింది. నియమ నిబంధనలకు లోబడి బోర్డు అనుమతితోనే సంస్థలో నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేస్తోంది.

# రౌడి షీటర్ దారుణ హత్య

హైదరాబాద్: హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్ కి చెందిన రౌడీషీటర్ అలీమ్ దారుణ హత్యకు గురయ్యాడు. ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లేపల్లి కూడలి సమీపంలో అలీమ్ ను గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు కత్తితో పొడిచి చంపి అక్కడి నుండి పరారయ్యారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఆసిఫ్ నగర్ పోలీసుల హుటాహుటిన హాస్పిటల్ కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# చదవు మానేసి డ్రగ్స్....

హైదరాబాద్, డ్రగ్స్ వినియోగంపై తెలంగాణ పోలీసులు ఉక్కు పాదం మోపుతున్న విషయం తెలిసిందే. తాజాగా డ్రగ్స్ సరఫరా చేస్తూ అరెస్ట్ అవుతున్న వారిలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉంటున్నారు. విద్యార్థులకు అసలు డ్రగ్స్ ఎక్కడినుండి వస్తున్నాయి అనే విషయంపై నార్కోటిక్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు కొన్ని నమ్మలేని నిజాలు బయటపడ్డాయి. బీటెక్ లేదా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈజీ మనీ కోసం అలవాటు పడి డ్రగ్స్ వ్యాపారంలోకి దిగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. డార్క్ వెబ్ ద్వారా డ్రగ్స్?ను ఆర్డర్ చేయడం నేర్చుకున్న విద్యార్థులు ఇక చదువులకు స్వస్తి చెప్పి డ్రగ్స్ వ్యాపారంపైనే దృష్టి పెడుతున్నారు. ఇటీవల రాచకొండ ఎస్ఓటి పోలీసులు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు యువకులు చదువును మధ్యలో వదిలేసి డ్రగ్స్ వ్యాపారంలోకి దిగినట్లుగా గుర్తించారు. భరత్ రెడ్డితోపాటు విఖ్యాత్ అనే ఇద్దరు విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరికి ఉన్న నెట్వర్క్ ద్వారా బెంగళూరు నుండి మత్తు పదార్థాలు కొనుగోలు చేసి వాటిని హైదరాబాద్?కు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఎక్కువగా వాడుతున్న ఎండిఎంఏ డ్రగ్?ను బెంగళూరుకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. అక్కడ ఒక్కో గ్రామంలో 1200 రూపాయలు పెట్టి కొనుగోలు చేస్తున్న విద్యార్థులు తిరిగి వాటిని హైదరాబాదులో అధిక రేటుకు విక్రయిస్తున్నారు. ఒక్కో గ్రామ్ డ్రగ్?ను 5000 రూపాయలకు విక్రయిస్తున్నారు. వీరిద్దరూ కాలేజీ?లో డ్రాప్ అవుట్ విద్యార్థులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో భరత్ రెడ్డిపై హయత్ నగర్?తో పాటు అబ్దుల్లాపూర్?మెట్?లోను కేసులు ఉన్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. వ్యసనాలకు బానిసై డ్రగ్స్ వ్యాపారంలో ఈజీగా డబ్బులు వస్తాయని తమ చదువులకు స్వస్తి చెప్పి ఈ తరహా వ్యాపారం చేస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. విద్యార్థులు ఎవరు డ్రగ్స్ బారిన పడవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# 30 లక్షలకు నీట్ అమ్మేశారు

న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన నీట్ యూజీ పేపర్ లీక్ అంశంలో తవ్వేకొద్దీ విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. బిహార్ కేంద్రంగా పేపర్ లీకేజీ జరిగినట్లు సిట్ విచారణలో తేలినట్లు జాతీయమీడియాలో కథనాలు వస్తున్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీకైనట్లు వదంతులు రాగా.. కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) వాటిని తోసిపుచ్చింది. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బిహార్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది. సిట్ చేపట్టిన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నీట్ పేపర్ లీక్ చేసినందుకు కొందరు అభ్యర్థులు రూ.30 లక్షల చొప్పున చెల్లించినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి బిహార్‌లో ఇప్పటివరకు 14 మందిని సిట్ అధికారులు ఇప్పటికే అరెస్టు చేశారు. అదుపులోకి తీసుకున్నవారిలో బిహార్ ప్రభుత్వ విభాగంలో పనిచేసే ఓ జూనియర్ ఇంజినీర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ గ్యాంగ్‌తో కలిసి అక్రమాలకు పాల్పడినట్లు, కొందరు నీట్ అభ్యర్థుల కుటుంబసభ్యులతోనూ టచ్‌లో ఉన్నట్లు.. ఆ జూనియర్ ఇంజినీర్ విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోందిమే 4న బిహార్‌లోని రామకృష్ణనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పాఠశాలలో ఈ ముఠా నకిలీ పరీక్ష సెషన్‌ను నిర్వహించింది. ఇక్కడ సమాధానాలతో కూడిన నీట్ ప్రశ్నపత్రాలను అభ్యర్థులకు పంపిణీ చేసింది. ఈ పేపర్ కోసం కొంతరు అభ్యర్థులు రూ.30 లక్షల నుంచి రూ.32 లక్షల వరకు ముడుపులు ఇచ్చారు. మొత్తం 35 మంది అభ్యర్థులకు ఈ ప్రశ్నాపత్రాలు అందాయి. అనంతరం ఆ ప్రశ్నాపత్రాలను అదే పాఠశాలలో కాల్చివేసినట్లు విచారణలో వెల్లడైందని జాతీయ మీడియా కథనాలు వస్తున్నాయి. విచారణలో భాగంగా నీట్ పేపర్ లీక్ అయినట్లు భావిస్తోన్న పాఠశాల నుంచి కాలిపోయిన ప్రశ్నపత్రం అవశేషాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. కేసుకు సంబంధించి విచారణ ముమ్మరంగా సాగుతోంది. మొత్తం 13 మంది నీట్ అభ్యర్థులు ఈ పేపర్ లీక్‌లో భాగస్వాములైనట్లు అధికారులు గుర్తించారు. ఇందులో నలుగురిని ఇప్పటికే అరెస్టు చేయగా.. మరో 9 మందికి తాజాగా నోటీసులు జారీ చేశారు. వీరు జూన్ 17, 18 తేదీల్లో విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. నీట్ పరీక్ష జరిగినప్పటి నుంచి అన్ని వివాదాలే కనిపిస్తున్నాయి. ఒకవైపు పేపర్ లీక్, మరోవైపు గ్రేస్ మార్కులు ఇవ్వడం, మరో కేంద్రంలో ఒక మీడియం బదులు మరో మీడియం ప్రశ్నపత్రం ఇవ్వడం ఇలా పరీక్ష రోజు నుంచి ఏదో ఒక వార్త వినిపిస్తూనే ఉంది. పేపర్ లీక్ వార్తలు కొట్టిపడేసిన కేంద్రం, ఎన్టీఏ.. వివాదం సుప్రీంకోర్టుకు చేరడంతో 1563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు రద్దు చేసింది. నీట్ ఫలితాల్లో అక్రమాలపై ఆరోపణలు రావడంతో.. స్పందించిన కేంద్రం వెంటనే నలుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని వేసింది. ఈ కమిటీ విచారణ జరిపి కేంద్రానికి నివేదిక సమర్పించింది. కమిటీ ఇచ్చిన నివేదికలోని నిర్ణయాలను కేంద్రం జూన్ 13న సుప్రీంకోర్టుకు వివరించింది. పరీక్ష సమయంలో కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన ఆ 1563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేస్తున్నట్లు కోర్టుకు వెల్లడించింది. యూజీ పరీక్షను రద్దు చేయాలని, పరీక్ష నిర్వహణలో చోటు చేసుకున్న అవకతవకలపై న్యాయస్థానం పర్యవేక్షణలో సీబీఐ లేదా ఇతర స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. నీట్ పరీక్ష రాసినవారిలో 20 మంది విద్యార్థులు ఈ పిటిషన్ వేశారు. ఇప్పటికే నీట్ పరీక్షలో అక్రమాలపై సుప్రీంకోర్టుతో పాటు.. వివిధ హైకోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.

**సాల్వార్ గ్యాంగ్ పనే**

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కావడం.. దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. బీహార్ రాజధాని పాట్నా కేంద్రంగా ఈ పేపర్ లీకేజీ జరిగిందని వార్తలు వినిపిస్తున్నాయి. కొన్ని జాతీయ మీడియా సంస్థలు పరిశోధనాత్మక కథనాలను ప్రసారం చేస్తున్నాయి. అయితే ఈ వ్యవహారంలో సాల్వర్ గ్యాంగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సాల్వర్ గ్యాంగ్ ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ అంటే రాష్ట్రాలలో పోటీ పరీక్షల సమయంలో పేపర్ లీ కేజీలకు యత్నిస్తుంటాయి. అభ్యర్థుల వద్ద డబ్బులు వసూలు చేసి.. వారికి ఈ పేపర్లను అమ్ముతుంటాయి. రహస్య ప్రాంతాలలో ప్రశ్నలకు సమాధానాలు ఎప్పటికప్పుడు వల్లె వేయిస్తూ ఉంటాయి. తీరా పరీక్ష సమయానికి పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తుంటాయి. ఈ వ్యవహారాన్ని రెండవ కంటికి తెలియకుండా జరుపుతుంటాయి. ఈ గ్యాంగ్ కు జాతీయస్థాయిలో నెట్వర్క్ ఉంది.. ఉదాహరణకు నీట్ పరీక్షనే తీసుకుంటే.. పాట్నా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల వద్ద సూపరింటెండెంట్ లకు భారీగా డబ్బు ఆశ చూపించారు. వారిని తమ వలలో వేసుకున్నారు. సూపరింటెండెంట్ లకు ప్రశ్న పత్రాలు చేతికి రాగానే వారు సాల్వర్ గ్యాంగ్ కు చేరవేశారు. ఆ ప్రశ్న పత్రాలను వివిధ సబ్జెక్టుల్లో నిపుణులైన వారితో పరిష్కరించి.. ఆ సమాధానాలను విద్యార్థులతో బట్టి కొట్టించారు. ఆ తర్వాత ఆ విద్యార్థులను నేరుగా పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకెళ్లి, పరీక్ష రాయించారు. హర్యానా లో ఒకే పరీక్ష కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు జాతీయస్థాయి ర్యాంకులు రావడం విశేషం. ఇందులో కొంతమంది విద్యార్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 717, 719 మార్కులు వేయడం అనుమానాలకు తావిస్తున్నది. ఈ సాల్వర్ గ్యాంగ్ ఇప్పుడు మాత్రమే కాదు, గతంలో బిహార్ టీచర్ రిక్రూట్ మెంట్ లోనూ ఇదే తీరుగా పని చేసింది. ఈ గ్యాంగ్ లో నితీష్ కుమార్ అనే వ్యక్తిని బీహార్ పోలీసులు పట్టుకున్నారు. అయితే అతడిని విచారిస్తే.. నీట్ వ్యవహారం బయటపడింది. అయితే ఇందులో ఇంకా ఎన్ని పెద్ద తలకాయలు ఉన్నాయో అంతు పట్టడం లేదని బీహార్ పోలీసులు అంటున్నారు. మరోవైపు నీట్ పరీక్ష రద్దుచేసి, కొత్తగా నిర్వహించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి ఆదేశాలు ఇవ్వాలని.. 20 మంది విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.. అంతేకాదు ఈ పరీక్షలో 620 కి మించి మార్కులు సాధించిన విద్యార్థుల నేపథ్యాన్ని పరిశీలించేందుకు ఒక స్వతంత్ర సంస్థతో పోస్ట్ ఎగ్జామ్ అనాలసిస్ నిర్వహించాలని వారు సుప్రీంకోర్టుకు విన్నవించారు..నీట్ పరీక్షలో అక్రమాల నేపథ్యంలో జూన్ 19, 20 తేదీలలో దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించేందుకు ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ పిలుపునివ్వడం విశేషం.

# నలుగురు బైకు దొంగలు అరెస్టు

వికారాబాద్: జల్సాల కోసం అలవాటుపడ్డ ఇద్దరు యువకులు మరో ఇద్దరు మైనర్ బాలురు లతో కలిసి ద్విచక్ర వాహనాలను దొంగతనాలు చేస్తున్న వీరిని తాండూర్ పోలీసులు అరెస్టు చేసి ఆరు బైక్లు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలిస్తున్నట్లుగా వికారాబాద్ జిల్లా తాండూరు డిఎస్పి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తాండూరు డిఎస్పి కార్యాలయంలో ఇందుకు సంబంధించి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ తాండూర్ పట్టణంలో ఈ నెల 17 వ తేది హోటల్ ముందు బైక్ దొంగతనం జరిగిందని బంటారం మండలానికి చెందిన బోయిని సత్యనారాయణ ఫిర్యాదు చేశారు ఈ క్రమంలో పట్టణంలోని విలేమున్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వంశీకృష్ణ గౌడ్ (20) అనే వ్యక్తి మోటర్ సైకిల్పై వస్తున్న క్రమంలో ఆయనను తనిఖీ చేయగా ఆయన వద్ద ఎలాంటి బైక్ సంబంధించినవి పత్రాలు లేకపోవడంతో అనుమానం వచ్చి ఇన్స్పెక్టర్ కాశీనాథ్ విచారణ చేయగా వంశీకృష్ణా గౌడ్ మరో వ్యక్తి జశ్వంత్ ఇద్దరు పార్కింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్నట్లుగా ఒప్పుకోవడం జరిగింది అదేవిధంగా ఇద్దరు మైనర్ బాలురు కూడా వీరికి సహకరిస్తున్నట్లుగా విచారణలో చేరడంతో దొంగలించిన 6 బైకులను స్వాధీనం చేసుకొని , జస్వంత్ వంశీకృష్ణ గౌడ్ ను అరెస్టు చేసి రిమైండర్ తరలిస్తున్నట్లు తెలిపారు మరో ఇద్దరు మైనర్ లను కూడా కోర్టులో హాజరు పరుస్తున్నారా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ సంతోష్ కుమార్, ఇన్స్పెక్టర్ కాశీనాథ్, రాములు, హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, అంజిద్, శివకుమార్, సాయప్ప షాబిల్ తదితరులు ఉన్నారు

# మేయర్ గుండు సుధారాణికి అవిశ్వాస గండం

వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణికి అవిశ్వాస గండం పొంచి ఉంది. ఆమెను గద్దె దించాలని గతం నుంచే ప్రయత్నాలు చేస్తుండగా, మంగళవారం బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు మున్సిపల్ కౌన్సిల్ హాలులోనే సమావేశం పెట్టుకున్నారు. ప్రస్తుతం గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతుండగా, ఆ ఒక్క పార్టీకి చెందిన కార్పొరేటర్లు మినహా మిగతా బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు సమావేశమై అవిశ్వాస నిర్ణయం తీసుకోగా, వరంగల్ నగరంలో ఇప్పుడిదే హాట్ టాపిక్ గా మారింది. ఇదిలాఉంటే పదవీ గండం పొంచి ఉందనే ఉద్దేశంతోనే గులాబీ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి ఎంట్రీ ఇచ్చిన సుధారాణికి ఇప్పుడు ఆమె అంటే గిట్టని కార్పొరేటర్లతో అవిశ్వాస ముప్పు పొంచి ఉండటంతో మేయర్ కాస్త ఆందోళనలో పడినట్లు తెలుస్తోంది.గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి 2021 ఏప్రిల్ లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున 29వ డివిజన్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం గులాబీ పార్టీ పెద్దల సహకారంతో అనూహ్యంగా మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నుంచి మేయర్ పదవిని ఆశించిన మిగతా కార్పొరేటర్లంతా తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. అప్పటినుంచి ఆమె తీరుపై అసహనంతోనే కొనసాగుతున్నారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తరువాత ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతవగా, కొంతమంది కార్పొరేటర్లు కూడా కండువాలు మార్చారు. బీఆర్ఎస్ లో మేయర్ తీరు నచ్చక కాంగ్రెస్ లో చేరారు. దీంతో గ్రేటర్ బీఆర్ఎస్ బలహీన పడగా, మేయర్ కూడా సెల్ఫ్ డిఫెన్స్ లో పడ్డారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లతో తన పదవికి గండం పొంచి ఉందనే ఆలోచనతో నాటకీయ పరిణామాల నడుమ సుధారాణి కూడా హస్తం గూటికి చేరారు.దీంతో ఆమె తీరు నచ్చక కాంగ్రెస్ లో చేరిన కార్పొరేటర్లు మేయర్ హస్తం పార్టీలోకి రావడాన్ని వ్యతిరేకించారు. కానీ అధిష్ఠానం ఆమెను పార్టీలో చేర్చుకోగా.. పార్టీ మారిన మేయర్ పీడ తప్పలేదనే భావనతో కొందరు కాంగ్రెస్ కార్పొరేటర్లు కూడా ఆమెపై అసంతృప్తితో రగులుతున్నారు.గ్రేటర్ వరంగల్ లో మొత్తంగా 66 మంది కార్పొరేటర్లు ఉండగా, ఆమెపై అప్పుడు బీఆర్ఎస్ లో ఇప్పుడు కాంగ్రెస్ లో గుర్రుగా ఉన్న కార్పొరేటర్ల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఈ రెండు పార్టీలకు తోడూ బీజేపీ కార్పొరేటర్లు కూడా ఆమెను గద్దె దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఉన్న మూడు పార్టీల కార్పొరేటర్లలో మెజారిటీ సభ్యులకు గుండు సుధారాణి మేయర్ గా కొనసాగడం ఇష్టం లేదనే విషయం స్పష్టమవుతోంది.గ్రేటర్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా, అందులో కాంగ్రెస్ కు 35 మంది సభ్యుల బలం ఉండగా, బీఆర్ఎస్ 22, బీజేపీకి 9 మంది సభ్యుల బలం ఉంది. కాగా అవిశ్వాసం కోసం పాలకవర్గంలోని సగానికంటే ఎక్కువ మంది కార్పొరేటర్లు సంతకం పెట్టాల్సి ఉంటుంది. కానీ అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇవ్వాలంటే సొంతంగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు సంఖ్యా బలం లేదు. దీంతోనే కాంగ్రెస్ పార్టీలోని కొందరు కార్పొరేటర్లను కూడా కలుపుకొని అవిశ్వాస తీర్మానం పెట్టాలనే యోచనలో కొందరు కార్పొరేటర్లున్నారు.ఎలాగైనా గుండు సుధారాణిని దించడంతో పాటు ఆ పదవిని దక్కించుకోవాలన్న ఆశతో ఉన్న కొందరు కార్పొరేటర్లు అవిశ్వాసానికి పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్, బీజేపీకి చెందిన దాదాపు 8 మంది కార్పొరేటర్లు అందరి ముందు బహిరంగంగానే సమావేశం అయ్యారు. తమకు ఉన్న బలంతో పాటు కలిసి వచ్చే కార్పొరేటర్లను కలుపుకుని తొందర్లోనే అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన లెటర్ అధికారులకు అందించనున్నట్లు తెలిసింది.అందులో మేయర్ తో పాటు డిప్యూటీ మేయర్ ను కూడా ఆ పదవి నుంచి తప్పించాలనే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలిసింది. ఈ నెల 20వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు సెక్రటరీ విజయలక్ష్మి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేయగా, అదే సమావేశంలో కార్పొరేటర్లంతా కలిసి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. ఇప్పటికే మేయర్ గుండు సుధారాణి పదవీ గండంతో గందరగోళంలో పడగా, రెండు, మూడు రోజుల్లో గ్రేటర్ రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకుంటాయోననే చర్చ జరుగుతోంది.

# సాగులో టెక్నాలజీ

అదిలాబాద్: ఒకప్పుడు దుక్కి దున్నాలన్నా, విత్తనాలు వేయాలన్నా, ఎరువులు చల్లాలన్నా, కలుపు తొలగించాలన్న ప్రతి పని ని రైతులు కూలీలు చేసుకునేవారు. లేదా ఒకరికొకరు పరస్పరం అవగాహనతో పనులు కానిచ్చేవారు. కానీ ప్రస్తుతం ట్రెండు మారింది. ప్రతి పనిని సమయం, డబ్బు వృథా చేయకుండా రైతులు వినూత్న రీతిలో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ, యాంత్రికరణతో ముందుకు సాగుతున్నారు. రాను రాను హైటెక్ కాలంలో కూలీల కొరత కారణంగా సకాలంలో ఎరువులు, విత్తనాలు అలకడానికి యంత్రాలను ఉపయోగిస్తూ డబ్బును సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు.వానకాలం సాగు మొదలైంది. అడపాదడప వర్షాలు పడుతుండడంతో రైతులు పొలం బాట పడుతున్నారు. దుక్కి దున్నడం మొదలుకొని విత్తనాలు వేయడం, ఎరువులు వేయడం, కలుపులు తీయడం వరకు గతంలో కూలీలతో చేసే పనిని యంత్రాలతో చేస్తున్నారు. కూలి రేట్లు పెరగడంతో రైతులు యంత్రాల పైన దృష్టి సారిస్తున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో యాంత్రీకరణ క్రమక్రమంగా పెరుగుతోంది. యాంత్రీకరణ లేక ముందు రైతులు ఎవరు ఎద్దులతో వారు అరకతోనే అన్ని రకాల విత్తనాలు వేసేవారు. ఎకరం పొలంలో విత్తనాలు నాటడానికి కనీసం ముగ్గురు నుంచి నలుగురు కూలీలు, అరక అవసరమయ్యేది. అయితే కూలి రేట్లు పెరగడంతో రైతులు యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. ఒక్కో కూలీకి రోజుకు విత్తనాలు వేయడానికి రూ. 300 నుంచి రూ. 400, అరక మనిషికి రూ. 1000, ఎద్దులకు రోజుకు 3000 కిరాయి ఉంది. మొక్కజొన్న సాగుకు ఎకరానికి విత్తనాలు వేయడానికి రూ. 4,000 నుంచి రూ. 5,000 వరకు అవుతున్నాయి. అదేవిధంగా పసుపుకు రూ. 5000 నుంచి రూ. 7,000 వరకు అవుతున్నాయి. కానీ అదే ఎకరం మొక్కజొన్న విత్తనాలు ట్రాక్టర్ తో వేయడానికి రూ. 2000, పసుపు వేయడానికి రూ. 3500 ఖర్చు మాత్రమే అవుతున్నాయి. దీంతో సమయం తగ్గడంతో పాటు సాగు ఖర్చులు కూడా సగానికి తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో మినహా మైదానంలో రైతులంతా ట్రాక్టర్లు డ్రోన్లు,తదితర యంత్రాలపైనే వ్యవసాయం చేస్తున్నారు. అన్ని రకాల విత్తనాలు యంత్రాలతోనే నాటుతున్నారు. పంట పొలాల్లో పురుగుల మందుల పిచికారి, ఎరువులు చల్లడం, విత్తనాలను వేయడం వంటి తదితర పనులకు రైతులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. సేద్యానికి కూలీల కొరత ప్రధాన సమస్యగా మారిన తరుణంలో దాన్ని అధిగమించేందుకు అన్నదాతలు డ్రోన్లు ఉపయోగిసు న్నారు. అదిలాబాద్ జిల్లాలో కొందరు యువకులు వ్యవసాయంపై అవగాహన కోసం హైదరాబాదు లాంటి పట్టణ ప్రాంతాల్లో శిక్షణ పొంది డ్రోన్లు కొనుగోలు చేసుకుని ఆయా గ్రామాల్లో రైతులకు సేద్యం అందిస్తూ ఉపాధి పొందుతున్నారు. రోజుల శిక్షణ తీసుకున్న అనంతరం ఐదు లక్షలతో డ్రోన్లు కొనుగోలు చేసి పంట పొలాల యజమానులకు సంప్రదించి పురుగు మందు పిచికారి కోసం కిరాయిలకు ఇస్తున్నారు. డ్రోన్ల ద్వారా సమయంతో పాటు పురుగుమందులు వృథా కాకుండా ఉంటాయని రైతు గంగారెడ్డి చెప్పారు. చేతి పంపు ద్వారా పిచికారి చేస్తే ఎకరానికి అయ్యే ఖర్చులలో డ్రోన్ ద్వారా పిచికారి చేస్తే సుమారు రూ. 1000 ఆదా అవుతాయని, 20 నిమిషాలలో ఎకరం పొలానికి పురుగుమందు పిచికారి చేయవచ్చు అని అన్నారు.జామ, నిమ్మ, దానిమ్మ, మామిడి, మునగ తదితర ఎత్తయిన పంటలకు డ్రోన్లు చాలా ఉపయోగపడతాయని రైతులు చెబుతున్నారు.

# భారత విప్లవోద్యమానికి మావో ఆలోచన విధానమే సరైన మార్గం

సిద్దిపేట: భారత విప్లవోద్యమానికి మావో ఆలోచన విధానమే సరైనదని గుర్తించిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ రాధక్క అని పలువురు నేతలు కొనియాడారు.గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో సీపీఐ( యం ఎల్) సీపీ పార్టీ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ కామ్రేడ్ సిపిరెడ్డి నిర్మించిన గోదావరిలోయ రైతాంగ ప్రతిఘటన పోరాటంలో బాగస్వామి అయ్యింది. వ్యక్తిగత కుటుంబ జీవితాన్ని త్యాగం చేసింది. భూమి, భుక్తి, పీడిత ప్రజలకు విముక్తిని కలిగించే లక్ష్యంతో ఆయుధాన్ని ఎత్తిపట్టింది. ఆత్మరక్షణ పోరాటంలో దళకమాండర్ గా ఎదిగింది. కామ్రేడ్ సిపిరెడ్డి కి అండగా నిలబడింది. విప్లవ ప్రతిఘనోద్యమంలో సిపిగారి సేవలను, తపనను గుర్తించి, ఆయన బాగోగుల కొరకు జీవిత సహచరి అయ్యింది. కామ్రేడ్ సిపిరెడ్డి తో పాటు దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఉద్యమ విస్తరణకు పాటుపడింది. శ్రామికవర్గ ప్రియమైన నేతగా ప్రజల మనసులలో నిలిచిపోయింది. ఎన్నో ఆటుపోటులను, నిత్య నిర్బంధాలను చవిచూసింది. అవమానాలను ఎదుర్కొన్నది. కామ్రేడ్ సిపి మరణాతరం గోదావరిలోయ విప్లవోద్యమాన్ని సజీవంగా నిలబెట్టేందుకు క్రుషిచేసింది. ఎక్కడ రాజీ పడకుండా తను నమ్మిన సిద్ధాంతం కోసం చివరిదాకా పోరాడింది. ప్రజలకు పార్టీ శ్రేణులకు వర్గ, విప్లవ చైతన్యాన్ని అందించింది. పటేల్, పట్వారీలు, ఫారెస్ట్ అధికారుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను కదిలించింది. లక్షలాది ఎకరాల ఆదివాసి, గిరిజన, గిరిజనేతర పేద ప్రజలకు భూములు పంచే కార్యక్రమానికి నాయకత్వం వహించింది. దోపిడీ, పీడన, అణిచివేతలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ఉక్కు మనిషిగా కామ్రేడ్ రాధక్క కొనియాడబడింది. బలమైన విప్లవోద్యమాన్ని నిర్మించే క్రమంలో ఆచరణలో ఎన్నో రాజకీయ, సిద్ధాంత, నిర్మాణ సమస్యలను ఎదుర్కొన్నది. తుదిశ్వాస వరకు విప్లవ జీవితానికే అంకితమైన కామ్రేడ్ రాధక్కను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.. విప్లవోద్యమంలో వ్యక్తిగత పనివిధానం, ఒంటెత్తు పోకడలు అనుసరించడం వలన చీలికలకు, పేలికలకు గురౌతున్నాయి. ఇలాంటి పెడ ధోరణులు విప్లవాన్ని ప్రక్కదారి పట్టిస్తాయని గుర్తించాలన్నారు. కామ్రేడ్ రాధక్క మరణం పట్ల సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ, కేంద్ర కమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తుందని తెలిపారు

# సెహభాష్.. సిబ్బంది...

కరీంనగర్: బంధాలు, అనుబంధాలు దూరమవుతున్న రోజులివీ. మనిషిలో మానవత్వం మచ్చుకైనా కనిపించని కాలమిదీ. ఎవరైనా రోడ్డు మీద యాక్సిడెంట్ జరిగి పడిపోతే.. ఆ మనకెందుకులే అని పట్టించుకోవడం మానేస్తున్నారు. పట్టించుకుంటే మనకేమైనా అవుతుందేమో అని భయపడుతున్నారు. కనీసం మాట సాయం కూడా చేయడానికి వెనుకాడుతున్న ప్రస్తుత సమాజంలో.. మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించారు. కరీంనగర్ ఆర్టీసీ సిబ్బంది. పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి ప్రసవం చేసి మానత్వం చాటుకున్నారు.కరీంనగర్ బస్టాండ్‌లో నిండు గర్భిణి పురిటి నొప్పులతో బాధపడింది. ఆసుపత్రికి తీసుకెళ్లే సమయం కూడా లేకపోవడంతో ఆర్టీసీ మహిళా సిబ్బంది ముందు చూపు ప్రదర్శించి.. బస్టాండ్ ఆవరణలోనే చీరలను గర్భిణి చుట్టూ అడ్డుగా కట్టారు. డెలివరీ చేశారు. ఈ విషయాన్ని టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు.ఒడిశాకు చెందిన వలస కూలీలు దూల, కుమారి దంపతులు. పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి ఇటుకబట్టీలో పని చేస్తున్నారు. కుమారి నిండు గర్భిణి. దీంతో ఛత్తీస్‌గఢ్‌లో కుంటకు వెళ్లేందుకు ఆదివారం సాయంత్రం బయల్దేరారు. కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చారు. ఇక్కడకు రాగానే కుమారికి పురిటి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే భర్త దూల ఆమెను పక్కన పడుకోబెట్టి.. సాయం చేయాలని ఆర్టీసీ అధికారులను వేడుకున్నాడు. వారు 108కి సమాచారం అందించారు. ఈలోగా నొప్పులు ఎక్కువ కావడంతో ఆర్టీసీ మహిళా స్వీపర్లు, సూపర్ వైజర్లు ముందుకు వచ్చారు. ఆంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో చీరలను అడ్డుపెట్టి నార్మల్ డెలివరీ చేశారు. కుమారి పండంటి ఆడబిడ్డ పుట్టింది. కొద్దిసేపటికి 108 అంబులెన్స్ రావడంతో తల్లీ బిడ్డను ఆస్పత్రికి తరలించారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.గర్భిణి విషయంలో సకాలంలో స్పందించిన ఆర్టీసీ సిబ్బందిపై ప్రయాణికులు ప్రశంసలు కురిపించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కూడా కరీనంగర్ ఆర్టీసీ మహిళా సిబ్బందిని అభినందించారు.

# శాంతి భద్రతల పరిరక్షణ కై అంకితభావంతో పని చేసిన అందరికీ అభినందనలు

**ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**

**ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ కి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది**

జగిత్యాల: శాంతి భద్రతల పరిరక్షణ కోసం అంకితభావంతో పని చేసిన అందరికీ ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అభినందనలు తెలిపారు..జగిత్యాల జిల్లా ఎస్పీ గా విధులు నిర్వహించిన సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ బదిలీ పై సూర్యాపేట జిల్లాకు వెళ్తున్న సందర్భంగా జిల్లా పోలీస్ తరపున ఆత్మీయ వీడ్కోలు ఏర్పాటు చేశారు..

ఈ సందర్భంగా ఈ ఆత్మీయ వీడ్కో కార్యక్రమంలో ఎస్పీ కి పోలీస్ అధికారులు వినూత్నంగా రీతిలో వీడ్కోలు పలికారు.

జిల్లాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొని పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా శాంతి కోసం రాజీపడకుండా తనతో పాటు అంకితభావంతో సమిష్టిగా కృషి చేసినందుకు పేరు పేరునా హోం గార్డ్ ఆఫీసర్స్ నుండి ఉన్నత అధికారుల వరకు అందరికీ ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.. ఎన్నికల సమయంలో ఎలాంటి చిన్న అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా విధులు నిర్వహించిన అందరికీ అభినందనలు తెలిపారు..ప్రజలు సుఖశాంతులతో ఉండేందుకు తన వంతు పూర్తి స్థాయిలో బాధ్యత నిర్వహించానని అన్నారు. గడిచిన 10 నెలల పాటు జిల్లాలో పని చేసే అవకాశం రావడం సంతోషాన్ని ఇచ్చిందని, సమర్థవంతంగా పనిచేసిన మధుర స్మృతులతో బదిలీ పై వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు ఉత్తమ సేవలందిస్తే గుర్తింపు పొందుతారని, పోలీస్ అధికారులు సిబ్బంది రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత ఉత్తమ సేవలు అందించాలని సూచించారు.ఆనంతరం ఎస్పీకి పోలీస్ అధికారులు గజమాలతో సత్కరించి పోలీస్ వాహనంలో ఎక్కించి అందరు పోలీసు అధికారులు వాహనాన్ని తాడుతో లాగుతూ ర్యాలీ గా ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ వీడ్కోలు కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు వినోద్ కుమార్ , భీమ్ రావు ,డిఎస్పి లు రవీంద్ర కుమార్, రఘు చంధర్, ఉమా మహేశ్వర రావు, డీసీఆర్బీ, ఎస్బీ , సీసీఎస్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, నాగేశ్వర రావు, లక్ష్మీనారాయణ,రఫీక్ ఖాన్, సి.ఐ లు వేణుగోపాల్,రామ్ నరసింహారెడ్డి,రవి,సురేష్ ,నవీన్,ఆర్ఐ లు జనీమియా,వేణు, ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మొర్రంతో రాచూర్ గ్రామ రోడ్డు నిర్మాణం చేపట్టిన ఎమ్మెల్యే..

**- అసెంబ్లీ ఎన్నికల ముందు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.2. 70 లక్షల రూపాయలు మంజూరు,**

**- పనులు మాత్రం సున్నా..**

**- నడవలేని రహదారి రోడ్డుతో రాచూరు గ్రామస్తులకు ఇబ్బందులు**

**- మొర్రం రోడ్డుతో రహదారి నిర్మాణం, ఎమ్మెల్యే చొరువ అభినందనీయం, గ్రామస్తుల్లో హర్షం..**

మద్నూర్: మద్నూర్ మండలంలోని రాచూర్ గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం లేక ఏడు దశాబ్దాల కాలంగా ఆ గ్రామస్తులు రహదారి ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. ఈ గ్రామం 161 జాతీయ రహదారి ప్రక్కన మూడు కిలోమీటర్ల లోపల ఉంది జాతీయ రహదారి నుండి గ్రామం వరకు రోడ్డు సౌకర్యం నిర్మాణం చేపట్టడంలో ఏడు దశాబ్దాలు ముగిసిపోయాయి. 8వ దశాబ్దంలో కొనసాగుతున్నప్పటికీ ఈ గ్రామ ప్రజలు బిటి రోడ్డు నిర్మాణానికి నోచుకోలేకపోతున్నారు. ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి పోయాయి. ఎందరో ఎమ్మెల్యే లు గెలిచారు. వెళ్లిపోయారు. అయినప్పటికీ రాచూరు గ్రామ ప్రజల రహదారి గురించి ఏ ఒక్కరు పట్టించుకోలేకపోయారు. వర్షాకాలం మొదలైంది అంటే ఆ గ్రామ ప్రజల రహదారి నరకవాతన ఎదుర్కోవాల్సిం దే. గత ఏడాది ఒకరు పూరూటి నొప్పులతో బాధపడుతుంటే ఆ గ్రామంలో గల ట్రాక్టర్ ఇంజన్ పైన తీసుకోవలసిన దుస్థితి ఏర్పడింది. అలాంటి దృశ్యం మాలికలతో పలు పత్రికల్లో ఆ గ్రామ ప్రజలు ఇబ్బందుల గురించి ప్రచురించడం జరిగింది. అలాంటి వార్తలకు గతంలో ఉన్న ఎమ్మెల్యే హనుమంతు షిండే స్పందించడం జరిగింది అసెంబ్లీ ఎన్నికల ముందర ఆ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం రెండు కోట్ల 70 లక్షల రూపాయలు మంజూరు అయినట్లు షీలా ఫలకాన్ని శంకుస్థాపన చేశారు. ఆ నిధులు ఏమయ్యాయెా కానీ ఆ గ్రామానికి బీటీ రోడ్డు నోచుకోలేకపోవడం, మళ్లీ వర్షాకాలం రానే వచ్చేసింది. ప్రస్తుతం జుక్కల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తోట లక్ష్మీ కాంతారావు రాచూరు గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని జాతీయ రహదారి నుండి గ్రామం వరకు మొరం రోడ్డు వేయించారు. ఇలాంటి రహదారితోనైనా ఆ గ్రామ ప్రజలు వర్షాకాలన్ని వెళ్ళదీయను న్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గ్రామస్తుల ఇబ్బందుల పట్ల చొరవ చూపి ముందు జాగ్రత్తగా మొరం రోడ్డు వేయించినందుకు ఆ గ్రామస్తులంతా ఎమ్మెల్యే పనితీరును అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారతదేశంలో మారుమూల గ్రామాలు ఎన్నో దశాబ్దాలు గడుస్తున్నప్ప టికీ బీటీ రోడ్డుకు నోచుకోలేకపోతున్నాయి. అంటే పాలకుల వ్యవహా రాలు అభివృద్ధి పనులు ఏ విధంగా ఉన్నాయో అర్థంచేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.గత ఎమ్మెల్యే హయంలో మంజూరైన రెండు కోట్ల 70 లక్షల నిధులు రాచూర్ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైనట్లు నిజమేనా లేక తూతూ మంత్రం గానే ఎన్నికలముందర ఓట్ల కోసమే శిలాఫలకం శంకుస్థాపన జరిగిం దా. ఏది ఏమైనా ఏడు దశాబ్దాలు గడిచాయి. 8వ దశాబ్దంలో కొనసా గుతున్నాం.. ఇప్పటికైనా ఆ గ్రామ ప్రజల ఇబ్బందులు దూరం కావాలం టే ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు ప్రత్యేక చొరవ చూపవల్సిందే బిటి రోడ్డు నిర్మించవలసిందే. ప్రజల మన్ననాలు పొందవలసింది ఈ ఎమ్మెల్యే హయంలో గ్రామ ప్రజలు ఉత్సాహపడవలసిందే గ్రామ సర్పంచ్ గా విధులు నిర్వహించిన పార్వతీభాయి శంకర పటేల్ అభివృద్ధి పనుల నిధులు లక్షల్లో రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. గత సర్పంచి హాయంలో రోడ్డుకు మొరం పనులు జరిగాయి నిధులు ఖర్చు పెట్టారు.

అలాంటి నిధులు ఏళ్లు గడిచిన రావడం లేదని ఆవేదన ఆ గ్రామ సర్పంచ్ వ్యక్తం చేస్తున్నారు.

# జగిత్యాలలో వింత కోడి

కరీంనగర్: జగిత్యాల జిల్లాలో వింత కోడి జనాల్ని ఆకట్టుకుంటోంది. యాజమాని చెప్పినట్టు వింటుంది. మనిషి చెప్పే మాటలు విని పాటిస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది. కడక్ నాథ్ కోడి ఖతర్నాక్ కోడి అనిపించుకుంటుంది.వివరాల్లోకి వెళ్ళితే జగిత్యాల మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి మినీ కొళ్ళ ఫారం నిర్వహిస్తు ఉపాధి పొందుతున్నాడు. అందులో 200 వరకు కడక్ నాథ్ రకం కోళ్ళను పెంచుతున్నాడు. అందులో ఓ కోడి వింతగా ప్రవర్తిస్తుంది. మల్లారెడ్డి చెప్పినట్లు వింటుంది.

మల్లారెడ్డి తో స్నేహపూర్వకంగా ప్రవర్తిస్తుంది. రమ్మంటే వస్తుంది. పొమ్మంటే దూరంగా పోతుంది. పో అనగానే ముందుకు ఉరుకుతుంది.వెనక్కి రా అంటే వెంటనే వెనక్కి వచ్చేస్తుంది. యాజమాని మల్లారెడ్డి భుజాల పైకి ఎక్కి తన అప్యాయతను చాటుకుంటుంది. చూపరులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మల్లారెడ్డి సైతం ఆ కోడి పట్ల అమితమైన అభిమానాన్ని చాటుకుంటున్నారుమనిషి చెప్పినట్లు వింటూ వింతగా ప్రవర్తిస్తున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దాన్ని చూసేందుకు జనం వస్తున్నారు. కోడి కావాలని కోరుకునే వారు కూడా లేకపోలేదు. యజమాని మాత్రం ఆ కోడిని విక్రయించడానికి నిరాకరిస్తున్నాడు. తాను చెప్పినట్లు వింటూ తనతో స్నేహపూర్వకంగా ప్రవర్తిస్తున్న కోడి బతికినంత కాలం తన ఫామ్ లోనే ఉంటుందంటున్నారు. ఇలాంటి కోడి దొరకడం అరుదని చిన్నప్పటి నుంచి తాను చెప్పినట్లు విని ఇప్పుడు అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తుందని తెలిపారు.ఎవరైనా ఏదైనా చెప్తే క్షణాల్లో మర్చిపోతే కోడి మైండ్ అంటూ నిందిస్తారు. ఎందుకంటే కోడి బూడిదలో పొర్లినప్పుడు వచ్చే ఆలోచన బయటకు వచ్చి బూడిద దులిపితే అంతా మరిచిపోతుందట.అందుకే కోడికి ఏది గుర్తుండదు కాబట్టి మనిషి కూడా మర్చిపోతే కోడి మైండోడా అంటారు. కానీ ఇప్పుడు లక్ష్మీపూర్ లో కడక్ నాథ్ కోడి యవ్వారాన్ని చూసిన తర్వాత దానిది కోడి మైండ్ కాదు మనిషి మైండేనని భావించే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఆ కోడి కడక్ నాథ్ కోడి కాదు, ఖతర్నాక్ కోడి అంటున్నారు.

# ఆర్టీవో ఉద్యోగి నిర్వాకం!

**చల్లగా బీరు కొడుతూ విధులు నిర్వహణ..**

**కమిషనర్ సీరియస్**

మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలోని ఓ ఉద్యోగి ఏకంగా ఆఫీస్‌లోనే దుకానం పెట్టాడు. బిందాస్‌గా బీరు కొడుతూ కొలువు వెలగబెడుతున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సదరు ఉద్యోగి నిర్వాకం వెలుగు చూసింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు అతడిని సర్వీస్ నుంచి తొలగించి ఇంటికి పంపారు. ఈ షాకింగ్ ఘటన జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. మహబూబాబాద్ ఆర్టీవోలో ఉద్యోగి నిర్వాకం.. బీరు తాగుతూ విధులు మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన సురేష్ డేటాబేస్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడు అప్లికేషన్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ మేనేజ్‌మెంట్ సర్వీస్ వంటి పనులు చేస్తుంటాడు. ఆఫీస్‌కి వచ్చిన సురేష్ వర్కింగ్ టైంలో తన సీటులో కూర్చుని, టేబుల్‌పై బీరు పెట్టి.. తాగుతూ విధులు నిర్వర్తించాడు. మత్తులో తూలుతూ పనులు చేస్తున్న అతన్ని లైసెన్స్ కోసం వెళ్లిన ఓ వ్యక్తి చూసి, తన ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో అది కాస్తా వైరల్‌గా మా రింది. దీనిపై సమాచారం అందుకున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సీరియస్‌గా పరిగణించారు. వెంటనే సురేశ్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అతని స్థానంలో మరో ఉద్యోగిని రిక్రూట్ చేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్‌లో డీటీఓగా పనిచేస్తున్న సురేశ్‌ను 'దుష్ప్రవర్తన', 'రిక్రూట్‌మెంట్ నిబంధనలు, షరతుల ఉల్లంఘన కారణంగా అతన్ని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. కాగా ఇటీవల కాలంలో మహబూబాబాద్ ఆర్టీఏ కార్యాలయం వివాదాలకు నిలయంగా మారింది. ఇటీవల ఈ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి.. ఆరుగురు ఏజెంట్లు, ఓ డ్రైవర్ వద్ద రూ.46 వేల నగదు సీజ్ చేశారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**